ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 02 సంచిక -38 పేజీలు - 08 వెల - 06/-
మంగళవారం 20 మే 2025

# పథకాల అమలులో పారదర్శకత

## క్షేత్రస్థాయిలో ప్రజలకు పథకాలు చేరాలి

- కార్యక్రమాల అమలుకు మళ్లీ ఆకస్మిక తనిఖీలు
- సమీక్షలో అధికారులతో సీఎం చంద్రబాబు





**అమరావతి,మే 19: (రిపబ్లిక్ న్యూస్)** పథకాల అమలుతీరును, అధికారుల పనితీరును బేరీజు వేస్తానని, ఇందుకోసం మళ్లీ ఆకస్మిక తనిఖీలు తప్పవని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. వచ్చే నెల 12 నుంచే ఆకస్మిక తనిఖీలు ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై సీఎం సమీక్షించారు. ప్రజా సేవ పథకాల అమలు, సంక్షేమ పథకాల పూర్తిస్థాయి సంతృప్తి ఇంకా కనిపించాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సేవల అమలుపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రేషన్, దీపం-2, ఆర్టీసీ, పంచాయతీ సేవలపై అభిప్రాయాలను పరిశీలించారు. పథకాలు,

మిగతా 2లో

# భారత్ ఏమైనా ధర్మసత్రమా?

- 140 కోట్లమందితో అవస్త పడుతున్నాం...
- : శ్రీలంక వ్యక్తికి సుప్రీంకోర్టు ఘాటు ప్రశ్న
- శ్రీలంక శరణార్థి అభ్యర్థనను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- భారత్ ప్రపంచ శరణార్థులకు ధర్మశాల కాదని స్పష్టం
- 140 కోట్ల జనాభాతో మేమే సతమతమవుతున్నామన్న జస్టిస్ దత్తా
- ఆర్టికల్ 19 హక్కులు కేవలం భారత పౌరులకేనని ఉద్ఘాటన

2లో



# నల్లమల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- నల్లమల డిక్లరేషన్ ఆవిష్కరణ
- గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లతో పనులు
- రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు
- ఇందిర సౌర గిరిజల వికాసం' పథకం ప్రారంభం
- నల్లమలను ఆదర్శంగా నిలుపుతానన్న సిఎం రేవంత్



**అమ్రాబాద్,మే 19: (రిపబ్లిక్ న్యూస్)** నల్లమల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పోడు భూములను వ్యవసాయానికి అనుకూలంగా మారుస్తున్నా మని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరిజల వికాసం' పథకాన్ని సీఎం ప్రారంభించారు.

# ఉగ్రవాద కదలికలపై ప్రత్యేక దృష్టి

## - సిఎస్, డిజిపిలకు డిప్యూటి సిఎం లేఖ



**అమరావతి,మే 19: (రిపబ్లిక్ న్యూస్)** రాష్ట్రంలో ఉగ్రవాద కదలికలపై నిరంతర అప్రమత్తత అవసరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తీర ప్రాంత జిల్లాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు- చేయాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి ఆయన లేఖ రాశారు. రోహింగ్యాలు, ఉగ్రవాద సానుభూతిపరులు, స్లీపర్ సెల్స్‌పై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. దేశ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా అంతర్గత భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రోహింగ్యాలు, స్లీపర్ సెల్స్‌పై దృష్టి పెట్టండని ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ పోలీస్ ఉన్నతాధికారులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉగ్రవాద కదలికలపై నిరంతర అప్రమత్తత అవసరమ న్నారు. దేశ, ప్రజల భద్రతకు

మిగతా 2లో

# ఎపిలో ఘోర రోడ్డు ప్రమాదం..

## - ముగ్గురు దుర్మరణం




**అమరావతి,మే 19: (రిపబ్లిక్ న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం ఉదయం నంద్యాల జిల్లాలోని ప్యాపిలి మండలం పోదొడ్డి వద్ద వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు

మిగతా 2లో

# జివిఎంసిలో తగిన సంఖ్యా బలం ఉంది

- డిప్యూటి మేయర్ ఎన్నిక వాయిదాకు కారణం వేరు
- ఏపీ టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు
- ఎన్నిక వాయిదాపై ఆరా తీసిన నారా లోకేశ్



**అమరావతి,మే 19: (రిపబ్లిక్ న్యూస్) :** గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) లో తమకు కావాల్సినంత సంఖ్య బలం ఉందని ఏపీ టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జీవీఎంసీలో డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా పడింది. ఈ నేపథ్యంలో సోమవారం విశాఖపట్నంలో పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు.. డిప్యూటీ- మేయర్ అభ్యర్థి ఎంపిక విషయంలో నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం కావడానికి ఒక కారణం ఉందన్నారు. గత రాత్రి 11.00 గంటలకు ఆ పదవి జనసేన పార్టీకి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే ఆ పదవి కోసం టీడీపీలో ఆశావాహు లున్న మాట వాస్తవమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇక ఈ ఎన్నిక వాయిదా పడడానికి కోఆర్డినేషన్ సమస్య కూడా ఒక కారణమన్నారు. అందుకే ఈ ఇబ్బంది వచ్చిందని ఆయన తెలిపారు. జీవీఎంసీ కౌన్సిల్‌కు సభ్యులంతా వస్తారని తాము ధీమాతో ఉన్నామన్నారు. దీనికి తాను పూర్తి బాధ్యత వహిస్తానని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మరోవైపు.. విశాఖపట్నంలో జరగాల్సిన డిప్యూటీ- మేయర్ ఎన్నిక

మిగతా 2లో



# వారంపాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

## - విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడి

**అమరావతి,మే 19: (రిపబ్లిక్ న్యూస్)** రానున్న వారం రోజుల పాటు-రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయని చెప్పింది. రాగల 24 గంటల్లో ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. బాపట్ల, నంద్యాల, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, వైయస్ఆర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. గంటకు 40-50 కిమీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం

మిగతా 2లో

# మళ్లీ కోవిడ్ కలకలం

## - నటి శిల్పా శిరోద్కర్‌కు పాజిటివ్



**ముంబై,మే 19: (రిపబ్లిక్ న్యూస్)** కొత్తగా మరోమారు కోవిడ్ విజృంభిస్తోందన్న వార్తల నేపథ్యంలో తాజాగా కోవిడ్ ఆందోళన కలిగిస్తో ంది. తాను కొవిడ్ బారిన పడినట్టు బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్ తెలిపారు. సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. జాగ్రత్తగా ఉండాలని, మాస్కులు తప్పనిసరిగా ధరించాలని అభిమా నులకు విజ్ఞప్తి చేశారు. శిల్ప త్వరగా కోలుకో వాలని పలువురు అభిమానులు, నెటిజన్లు కామెంట్లు- పెడుతున్నారు. 'కొవిడ్ జర్నీ మళ్లీ మొదలైందా?' అంటూ సందేహం వ్యక్తం చేస్తు న్నారు. సింగపూర్, హాంకాంగ్, థాయ్‌లాండ్.. తదితర దేశాల్లో ఇటీ-వల కొవిడ్ కొత్త కేసులు ఎక్కువగా నమోదు కావడం గమనార్హం. మహేశ్‌బాబు సతీమణి నమ్రతా శిరోద్కర్ సోదరి శిల్పా శిరోద్కర్. ఈ బాలీవుడ్ నటి 'బ్రహ్మ' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టారు. పలు హిందీ సీరియళ్లలో కీలక పాత్రలు పోషించిన ఆమె 'బిగ్‌బాస్ 18' (హిందీ) కంటెస్టెంట్‌గా అందరికీ పరిచయం. ఇదిలావుంటే క్రికెటలర్ ట్రావిస్ హెడ్ కూడా కోవిడ్ బారిన పడ్డట్లు వార్తలు వస్తున్నాయి.

మిగతా 2లో

## ఎపిలో ఘోర రోడ్డు ప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారిని కర్ణాటక వాసులుగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉగ్రవాద కదలికలపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని.. రాష్ట్ర వ్యాప్తంగా అంతర్గత భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీకి ఆయన లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా అంతర్గత భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలి' అని డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ లేఖలో పేర్కొన్నారు.

## జివిఎంసిలో తగిన సంఖ్యా బలం ఉంది

(మొదటి పేజీ తరువాయి)

వాయిదా పడడం.. అందుకు పార్టీ కార్పొరేటర్లు గైర్హాజరు కారణం కావడంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం సీరియస్ అయింది. ఈ ఎన్నికకు గైర్హాజరైన వారికి నోటీ-సులు జారీ చేయాలని రాష్ట్ర నాయకత్వానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదేశించారు. కొందరిపై చర్యలకు వెనకాడ వద్దని ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వానికి ఆయన కీలక సూచన చేశారు. మరోసారి ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విశాఖపట్నం డిప్యూటీ- మేయర్ ఎన్నిక ఈ రోజు జరగాల్సి ఉంది. కానీ కౌన్సిల్‌లో సభ్యులు మొత్తం 74 మంది ఉంటే.. 54 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ డిప్యూటీ- మేయర్ ఎన్నికకు 56 మంది సభ్యులు అవసరమవుతారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికను మంగళవారం నిర్వహించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇంకోవైపు ఈ డిప్యూటీ- మేయర్ ఎన్నికకు కౌన్సిల్ సభ్యులంతా హాజరు కావాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

## వారంపాటు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉంది. మరోవైపు తెలంగాణలో మరో నాలుగు రోజులు వర్షాలు కురవనున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. నేడు, రేపు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈరోజు కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్ పేట్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, ములుగు, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్స్ జారీ చేసింది.

## శ్రీవారికి అఖండాల విరాళం

**తిరుమల,మన జనప్రగతి మే 19:** తిరుమల శ్రీవారికి శతాబ్దాల అనంతరం అఖండాలను మైసూరు రాజమాత ప్రమోదా దేవి విరాళంగా అందజేశారు. రంగనాయకుల మండపంలో రెండు భారీ వెండి అఖండ దీపాలను సోమవారం అందించారు. ఈ అఖండాలు గర్భగుడిలో వెలిగించే సంప్రదాయ దీపాలు. సుమారు 300 సంవత్సరాల క్రితం అప్పటి మైసూరు మహారాజు ఇలాంటి దీపాలను ఆలయానికి విరాళంగా అందించినట్లు- చరిత్రలో ఉంది. ఇప్పుడు మళ్లీ మైసూరు రాజమాత వాటిని సమర్పించారు. ఒక్కో వెండి అఖండం సుమారు 50 కిలోల బరువుంటుంది. టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు, అదనపు ఇఒ సి.హెచ్. వెంకయ్య చౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నకిలీ పట్టాల పంపిణీపై విచారణ

### - వంశీ కేసు విచారణ నేటికి వాయిదా

**విజయవాడ,,మే 19: (రిపబ్లిక్ న్యూస్) ::** గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత వల్లభనేని వంశీ మోహన్‌కు.. కొన్ని కేసుల్లో బెయిల్, ముందస్తు బెయిల్ వచ్చినా.. ఇంకా జైలులోనే మగ్గాల్సిన పరిస్థితి వచ్చింది.. నకిలీ పట్టాల పంపిణీ కేసు వ్యవహారంలో వంశీ బెయిల్ పిటిషన్ పై సోమవారం ఏలూరు జిల్లా నూజివీడు కోర్టులో విచారణ జరిగింది.. నకిలీ పట్టాల పంపిణీ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టింది.. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను కీలక ఆదేశాలు జారీ చేసింది నూజివీడు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు.. ఆ తర్వాత వల్లభనేని వంశీ మోహన్ బెయిల్ పిటిషన్‌పై విచారణను మంగళవారానికి వాయిదా వేసింది కోర్టు.. కాగా, ప్రస్తుతం గన్నవరం నియోజకవర్గంలో నకిలీ పట్టాల పంపిణీ వ్యవహారంలో విజయవాడ సబ్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు వల్లభనేని వంశీ మోహన్.. ఆయన్ని మొదట అరెస్ట్ చేసిన కిడ్నాప్ కేసు, ఆ తర్వాత గన్నవరం టీ-డీపీ కార్యాలయంపై దాడి కేసు.. ఇలా అన్ని కేసుల్లో బెయిల్, ముందస్తు బెయిల్ వచ్చినా.. ఇప్పుడు నకిలీ పట్టాల పంపిణీ కేసులో రిమాండ్ ఖైదీగా వల్లభనేని వంశీ మోహన్ ఉన్నారు..

## పథకాల అమలులో పారదర్శకత ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

పౌరసేవలపై జూన్ 12 తర్వాత ఆకస్మిక తనిఖీ ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే సేవల్లో ప్రజలకు పూర్తిస్థాయి సంతృప్తి ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపరచాలని ఆదేశాలు జారీ చేశారు. దీపం లబ్ధిదారులకు ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము ఇచ్చే అంశంపై పరిశీలించాలన్నారు. డేటా అనలటిక్స్‌కు అన్ని శాఖల్లో అత్యంత ప్రాధాన్యమివ్వాలని అధికారులకు సీఎం మార్గనిర్దేశర చేశారు.ఆర్టీసీ సేవల్లో ఇంకా మార్పులు రావాలని, నాణ్యత పెరగాలన్నారు సీఎం చంద్రబాబు సూచించారు. దీపం పథకంలో ఇచ్చే మూడు సిలండర్ల సబ్సిడీ ఒకేసారి జమ చేస్తామన్నారు. ప్రభుత్వ సేవల్లో డేటా కీలకం అని సీఎం అధికారులతో అన్నారు. 'జూన్ 12 తర్వాత ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు జరగొచ్చు. ప్రజలకు అందించే సేవల్లో పూర్తిస్థాయి సంతృప్తి రావాల్సిందే. ఆర్టీసీలో సౌకర్యాలు, సదుపాయాలు ఇంకా మెరుగుపడాలి. దీపం లబ్ధిదారుల ఖాతాలో ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము జత అవుతుంది. డాటా అనలిటిక్స్‌కు అన్ని శాఖల్లో అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. రేషన్ పంపిణీ నాణ్యతపై ప్రజల సంతృప్తి పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. కొన్ని సంక్షేమ పథకాల అమలు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయిలో సంతృప్తి కనిపించాలి. ఆర్టీసీ టాయిలెట్స్, తాగునీటి నిర్వహణ విషయంలో అసంతృప్తి వస్తోంది. త్వరలో డ్వాక్రా మహిళలకు తడి చెత్త నిర్వహణ బాధ్యత, కంపోస్టు తయారీ అప్పగిస్తాం. ప్రభుత్వ సేవల్లో డేటా కీలకం' అని ప్రభుత్వ పథకాలు, సేవలపై సమీక్షలో సీఎం చంద్రబాబు అన్నారు.

## భారత్ ఏమైనా ధర్మసత్రమా?

### 140 కోట్లమందితో అవస్త పడుతున్నాం...

### : శ్రీలంక వ్యక్తికి సుప్రీంకోర్టు ఘాటు ప్రశ్న

**న్యూఢిల్లీ,మే 19:(రిపబ్లిక్ న్యూస్) :** "ప్రపంచంలోని శరణార్థులందరికీ ఆశ్రయం కల్పించడానికి భారతదేశం ఏమీ ధర్మసత్రం కాదు. ఇప్పటికే 140 కోట్ల జనాభాతో మేం ఇబ్బందులు పడుతున్నాం. విదేశీ పౌరులందరినీ చేర్చుకోవడానికి ఇది ధర్మశాల కాదు," అంటూ సుప్రీంకోర్టు ఓ శ్రీలంక జాతీయుడిపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తనకు ఆశ్రయం కల్పించాలంటూ సదరు వ్యక్తి పెట్టుకున్న పిటిషన్‌ను శుక్రవారం కొట్టివేసింది. ఈ దేశంలో స్థిర నివాసం కల్పించాలనే హక్కు మీకెక్కడిదని ఘాటుగా ప్రశ్నించింది. జస్టిస్ దిపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది.శ్రీలంకలో ఒకప్పుడు క్రియాశీలంగా ఉన్న లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ) ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై 2015లో సదరు శ్రీలంక జాతీయుడిని భారత్ లో అరెస్టు చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (%ఖూాూ%) కింద 2018లో ట్రయల్ కోర్టు అతడిని దోషిగా నిర్ధారించి, పదేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, 2022లో మద్రాస్ హైకోర్టు ఈ శిక్షను ఏడేళ్లకు తగ్గించింది. శిక్షాకాలం పూర్తయ్యాక దేశం విడిచి వెళ్లాలని, అప్పటివరకు శరణార్థుల శిబిరంలో ఉండాలని ఆదేశించింది.దీంతో, సదరు శ్రీలంక తమిళ జాతీయుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తాను వీసాపైనే భారత్‌కు వచ్చానని, స్వదేశంలో తనకు ప్రాణహాని ఉందని, తన భార్యాపిల్లలు ఇక్కడే స్థిరపడ్డారని తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. శిక్ష పూర్తయి దాదాపు మూడేళ్లు కావస్తున్నా తనను ఇంకా నిర్బంధంలోనే ఉంచారని, దేశం నుంచి పంపించే ప్రక్రియ కూడా ప్రారంభించలేదని వాపోయాడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ), ఆర్టికల్ 19 (ప్రాథమిక హక్కులు - వాక్ స్వాతంత్ర్యం, సంచార స్వేచ్ఛ వంటివి) కింద తమకు హక్కులున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు.

## కాల్పుల విరమణలో అమెరికా పాత్ర శూన్యం

### ● పార్లమెంటరీ కమిటీకి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వివరణ



**న్యూఢిల్లీ,మే 19: (రిపబ్లిక్ న్యూస్) :** భారతదేశం-పాకిస్థాన్ కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సోమవారం పార్లమెంటరీ కమిటీకి చెప్పారని ఓ కథనం తెలిపింది. సైనిక చర్యలను నిలిపివేయాలనే నిర్ణయం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక స్థాయిలో తీసుకున్నారని మిస్రీ నొక్కిచెప్పారని పార్లమెంటరీ వర్గాలు తెలిపినట్లు- పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్-పాక్ వివాదాన్ని ఆపడంలో తన పాత్ర గురించి పదే పదే ప్రస్తావించారు. ట్రంప్ వాదనలపై ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో మిస్రీ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ కనీసం ఏడుసార్లు కాల్పుల విరమణకు దోహదపడ్డానని బహిరంగంగా చెప్పుకున్నారు. ఈ అంశంపై భారతదేశం ఎందుకు మౌనంగా ఉందని పార్లమెంట్ ప్యానెల్‌లోని ఒక సభ్యుడు ప్రశ్నించారు. ముఖ్యంగా ట్రంప్ తన ప్రకటనలలో కశ్మీర్‌ను ప్రస్తావిస్తూనే ఉన్నారని మరో సభ్యుడు సూటిగా ప్రశ్నించారు. దీంతో భారతదేశం-పాకిస్థాన్ కాల్పుల విరమణ ద్వైపాక్షిక నిర్ణయం అని, మరే ఇతర దేశ ప్రమేయం లేదని పేర్కొంటూ విదేశాంగ కార్యదర్శి ఈ వాదనలను తోసిపుచ్చారని పార్లమెంట్ వర్గాలు తెలిపాయి. యుద్ధ విరమణ ఒప్పందంలో అమెరికా ఎటు-వంటి పాత్ర పోషించలేదని మిస్రీ ప్యానెల్‌కు వివరణ ఇచ్చారు. ఇంకా.. భారత్- పాకిస్థాన్ మధ్య వివాదం సంప్రదాయ యుద్ధ పరిధిలోనే ఉందని, ఇస్లామాబాద్ నుంచి ఎటు-వంటి అణ్వాయుధ దాడులకు సంబంధించిన అనుమానిత సంకేతాలు లేవని విదేశాంగ కార్యదర్శి పునరుద్ఘాటించారు. కానీ.. పాకిస్థాన్ చైనా మూలాల సైనిక హార్డ్‌వేర్‌ను ఉపయోగించడంపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్పందించిన విక్రమ్ మిస్రీ.. 'వారు ఏమి ఉపయోగించినా పర్వాలేదు. మనము వారి వైమానిక స్థావరాలను తీవ్రంగా దెబ్బతీశాం అని చెప్పినట్లు- తెలుస్తోంది. యుద్ధ సమయంలో కోల్పోయిన భారతీయ విమానాల సంఖ్య గురించిను చెప్పేందుకు మిస్రీ నిరాకరించారు. జాతీయ భద్రతా సమస్యలను పేర్కొంటూ వ్యాఖ్యానించలేదు.

## చంద్రబాబు చొరవ అభినందనీయం



### ● ఇటీవలి భేటీపై బాబుకు బిల్‌గేట్స్ లేఖ

**అమరావతి,మే 19: (రిపబ్లిక్ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవను అభినందిస్తూ గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్‌గేట్స్ సోమవారం లేఖ రాశారు. ఢిల్లీలో గేట్స్ ఫౌండేషన్, ఏపీ ప్రభుత్వం మధ్య ఇటీవల జరిగిన ఒప్పందం, సమావేశాన్ని ప్రస్తావిస్తూ సీఎం చంద్రబాబుపై బిల్‌గేట్స్ ప్రశంసలు కురిపించారు. చంద్రబాబు తన బృందంతో ఢిల్లీ వచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని బిల్ గేట్స్ అన్నారు. మంచి వాతావరణంలో సంప్రదింపులు జరపడం సంతోషంగా ఉందన్నారు. పేదలు అట్టడుగు వర్గాల విద్య, ఆరోగ్యం సహా వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధిపైనా గేట్స్ ఫౌండేషన్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఆరోగ్య రంగాన్ని పటిష్ట పరచడం, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్, ఏఐ అసిస్టెడ్ క్లినికల్ డెసిషన్ మేకింగ్, మెడ్-టె-క్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దడం, వ్యవసాయంలో నాణ్యమైన విత్తనాల తయారీ, సాయిల్ హెల్త్ మోనిటరింగ్, తల్లీబిడ్డల ఆరోగ్యానికి మైక్రోన్యూట్రీ-యంట్లు- అందించే అంశాలపై ఇరువురం చర్చించామని బిల్‌గేట్స్ గుర్తు చేశారు. పాలనలో టెక్నాలజీ, ఇన్నోవేషన్‌ను బలోపేతం చేసేందుకు, మెరుగైన సేవలు అందించేందుకు మీరు చూపిన ఆసక్తి, చిత్తశుద్ధి మీ విజన్‌కు నిదర్శనం. మీరు ఆశించే ఏఐ డ్రివెన్ డిసిషన్ మేకింగ్, రియల్ టైమ్ డేటా సిస్టమ్, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ వంటివి మీ నాయకత్వ ప్రతిభను ప్రస్ఫుటం చేస్తున్నాయి. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో... ప్రభుత్వ సేవల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు మీరు చేస్తున్న కృషి ఆంధప్రదేశ్‌కే కాదు భారత్‌తో సహా, అల్పాదాయ దేశాలకు ఉపయోగపడుతుంది. ఈసారి నా భారతదేశ పర్యటనలో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే నాటికి... మీ నాయకత్వం- మన భాగస్వామ్యంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవడంలో అద్భుతమైన పురోగతి సాధించగలమని చెప్పగలను. గేట్స్ ఫౌండేషన్ -ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యం మున్ముందు

## నందిగం సురేశ్‌కు జూన్ 2వరకు రిమాండ్

### ● గుంటూరు జైలుకు తరలించిన పోలీసులు

**గుంటూరు,మే 19: (రిపబ్లిక్ న్యూస్) :** వైకాపా నేత, మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు మంగళగిరి కోర్టు జూన్ 2 వరకు రిమాండ్ విధించింది. ఆయన్ను పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో తెదేపా కార్యకర్త రాజుపై దాడి చేసిన కేసులో ఆదివారం ఆయన్ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కోర్టులో హాజరుపరచడానికి ముందు మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో నందిగం సురేశ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, మధుమేహం స్థాయులను పరీక్షించారు. సురేశ్‌ను కోర్టులో ప్రవేశపెట్టే సమయంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు- చేశారు. కోర్టు ప్రాంగణంలో ఇతరులను ఖాళీ చేయించారు. ఆయన అనుచరులు భారీగా చేరుకోవడంతో వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టారు. 14 రోజుల పాటు రిమాండ్ విధించింది న్యాయస్థానం. దీంతో నందిగం సురేష్‌ను పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. ఇప్పటికే పలు కేసులలో వైసీపీ మాజీ ఎంపీ బెయిల్‌పై ఉన్నారు. సోమవారం ఉదయం వైద్య పరీక్షల నిమిత్తం ఆయనను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం మంగళగిరి కోర్టులో మాజీ ఎంపీని పోలీసులు హాజరుపర్చగా.. కోర్టు రిమాండ్ విధించింది.గత శనివారం రాత్రి మాజీ ఎంపీ స్వగ్రామం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో టీడీపీ కార్యకర్త రాజు అనే వ్యక్తిపై నందిగం సురేష్, అతడి సోదరుడు, అనుచరుడు మూకుమ్మడి దాడి చేశారు. తన భర్తపై హత్యప్రయత్నం చేశారంటూ రాజు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ ఎంపీపై తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు.. రాజును కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు- నిర్ధారించి నందిగం సురేష్‌తో పాటు- మరి కొంతమందిపై కేసు నమోదు చేశారు. నిన్న (ఆదివారం) సురేష్‌ను తుళ్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఈరోజు (సోమవారం) మంగళగిరి కోర్టులో హాజరుపర్చారు. సురేష్‌కు కోర్టు 14 రోజుల పాటు- రిమాండ్ విధించగా.. వెంటనే అతడిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. నెలల తరబడి నందిగం సురేష్ గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవించి వచ్చిన విషయం తెలిసిందే. గతంలో మరియమ్మ అనే మహిళ హత్య కేసు, తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి కేసులో కూడా అరెస్ట్ అయి జైలుకు వెళ్లి వచ్చారు. ఇప్పటి వరకు మాజీ ఎంపీపై 12 కేసులు ఉండగా.. ఇప్పుడు 13వ కేసు నమోదు అయినట్లు- తుళ్లూరు డీఎస్పీ తెలిపారు. మరో రెండు కేసులు నమోదు అయితే నందిగం సురేష్‌పై పీడీ యాక్ట్ పెట్టేందుకు సిఫారసు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## నల్లమల అభివృద్ధికి ప్రత్యేక కృషి

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా 'నల్లమల డిక్లరేషన్'ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లతో పనులు చేపడతామని తెలిపారు. అనంతరం నల్లమల ప్రాంతం గురించి సీఎం ప్రసంగించారు. ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతం. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారని నాటి రోజులను సీఎం గుర్తు చేశారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే తన గుండె ఉప్పొంగిపోతోందన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రైతులకు గుడ్ న్యూస్ చెప్పారు. ఇక్కడి రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. వందరోజుల్లో సోలార్ విద్యుత్ మోటార్ అందిస్తామని శుభవార్త చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికేఆదర్శంగా మారుస్తామని అన్నారు. దిగ్గజ కంపెనీలతో పోటీపడేలా శిల్పారామం దగ్గర మహిళలకు స్టాళ్లు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. సన్నబియ్యం లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి భోజనం చేసి వచ్చానని గుర్తు చేశారు. నేడు ప్రతి పేదవాడి ఇంటికీ సన్న బియ్యం అందుతోందని తెలిపారు. ఇప్పటి వరకు రైతుల కోసం రూ.60వేల కోట్లు- ఖర్చు చేశామని సీఎం వెల్లడించారు. గతంలో వరి వేస్తే ఉరే అని ఆనాడు అన్నారు.. ఆ దొర మాత్రం వందల ఎకరాల్లో వరి వేసుకున్నారు.. మీరు వరి పండిస్తే బోనస్ ఇస్తామని మేము చెప్తున్నాం.. పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం.. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే ఎవరూ తినేవారు కాదు.. రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకున్నాం. నిత్యావసరాల ధరలు తగ్గించడంలో మనమే నంబర్ వన్ అని కేంద్రం చెప్పింది.. శాంతి భద్రతల్లో కూడా మనమే నంబర్ వన్‌లోనే ఉన్నాం.. రాష్ట్ర ఆదాయంలో కూడా తెలంగాణ నంబర్ వన్ అని కేంద్రమే చెప్పింది.. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల కోసం రూ.60 వేల కోట్లు- ఖర్చు చేశాం అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతం. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే నా గుండె ఉప్పొంగిపోతోంది. పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని గర్వంగా చెప్పుకొంటా. కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ఈ ప్రాంతం రుణం తీర్చుకుంటున్నా. దేశంలో ఎక్కడ ప్రాజెక్టులు కట్టాలన్నా పాలమూరు వాసులను పిలిచేవారు. ఇక్కడి ప్రజలు కట్టిన ప్రాజెక్టులు నేడు దేశానికి వెన్నెముకగా నిలిచాయి. ఇక్కడి రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఇస్తాం. వందరోజుల్లో సోలార్ విద్యుత్ మోటార్ అందిస్తాం. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శంగా మారుస్తాం అన్నారు. పహల్గాం ఘటన తర్వాత ప్రధాని అంటే ఇందిరాగాంధీలా ఉండాలనే చర్చ వచ్చింది. ఆమె గతంలో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఆ దేశాన్ని రెండు ముక్కలు చేశారు. 50 ఏళ్ల తర్వాత ఇందిరాగాంధీ పేరు చెప్పుకొంటున్నాం. దేశానికి స్వేచ్ఛనిచ్చిందే కాంగ్రెస్. అందరికీ భూములు ఇచ్చి ఆత్మగౌరవం నింపాలన్నది మా పార్టీ నినాదం. ప్రతి ఆదివాసీ గుండెల్లో ఇందిరమ్మ ఉంటు ందని రేవంత్ అన్నారు. అనంతరం సతీమణితో సహా సీఎం రేవం త్‌రెడ్డి కొండారెడ్డిపల్లె శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడ సీఎం దంపతులు, మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. సభాపతి గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహా, సీతక్క పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

## లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలి -జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు ప్రతినిధి, మే 19: (రిపబ్లిక్ న్యూస్)** ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు.ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.. పిజిఆర్ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని చెప్పినప్పటికీ కొన్ని శాఖల అధికారులు వారం, 10 రోజులైనా చూడడం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.. సిడిపిఓ కర్నూలు అర్బన్, ఆదోని మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్ కర్నూలు అర్బన్, డిప్యూటీ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ శాఖల కు సంబంధించి వారం నుంచి పది రోజులైనా అర్జీలను చూడలేదని, అర్జీలను చూడకుంటే ఎలా అని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు..ప్రజల అర్జీలకు సంబంధించి నిర్లక్ష్యం చేయకూడదని, లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. అలాగే వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్





ఆదేశించారు.పిజిఆర్ఎస్ లాగిన్ లో పరిష్కారం చేసిన అర్జీలను సక్రమంగా పరిష్కారం చేశారా లేదా అని ఆడిట్ చేయాల్సి ఉందన్నారు.. ఈ అంశం పై ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓ లు ఆడిట్ చేయడం లో పెండింగ్ ఉన్నాయని, వెంటనే ఆడిట్ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు..అలాగే పోలీస్ శాఖ , డిఆర్డిఓ , ఏడి సర్వేయర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ల వద్ద కూడా ఆడిట్ పెండింగ్ లో ఉందని, వ్యక్తిగతన పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రీ సర్వే గ్రామ సభలకు సంబంధించి రీ ఓపెన్ అయిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సర్వే శాఖ అధికారిని ఆదేశించారు. అలాగే రెవెన్యూ సదస్సులకు సంబంధించిన అర్జీలను కూడా ద్వైతగతిన పరిష్కరించాలని కలెక్టర్ రెవిన్యూ శాఖ అధికారులను ఆదేశించారు..సిఎంఓ గ్రీవెన్స్ లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 20, కర్నూలు ఆర్డీఓ వద్ద 10, పత్తికొండ ఆర్డీఓ వద్ద 7, సర్వే ఏడి వద్ద 2, డి ఎం హెచ్ ఓ, వ్యవసాయ శాఖ, మెప్మా, సైనిక సంక్షేమ శాఖ వద్ద 1 అర్జీ చొప్పున పెండింగ్ లో ఉన్నాయన్నారు.. సిఎంఓ గ్రీవెన్స్ లు పెండింగ్ ఉండకూడదని, ఎప్పటికపుడు పరిష్కారం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, అనురాధ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో పలు ప్రాంతాలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**అసాంఘిక, సంఘ విద్రోహశక్తుల ఆట కట్టించి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**రౌడీషీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమానస్పద వ్యక్తుల ఇళ్ళల్లో విస్తృతంగా దాడులు**

**సరైన దృవపత్రాలు లేని సుమారు 44 వాహనాలు, 30 క్వాటర్ బాటిల్లు స్వాధీనం**

**ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు**





**నంద్యాల క్రైం, మే 19, (రిపబ్లిక్ న్యూస్):** నేరనివారణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా నంద్యాల జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి ఉంచి నేటి తెల్లవారుజామున జిల్లాలోని పలు ప్రాంతాలలో కార్డెన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రౌడీషీటర్లు నేర చరిత్ర గలవారు అనుమానితుల ఇళ్లను సోదాలు నిర్వహించి అక్రమ మద్యం, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీస్ అధికారులు వారితో మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలియజేస్తూ పోలీసుల మాటలను బేఖాతరు చేసినట్లయితే అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

**కార్డెన్ అండ్ సర్చ్ చేసిన పోలీస్ స్టేషన్ ల వివరాలు**

ఆత్మకూరు సబ్ డివిజన్ లోని పాములపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఇస్కాల గ్రామం నందు ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 08 మోటార్ సైకిళ్లను, 14 అక్రమ మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామం నందు ఆళ్లగడ్డ టౌన్ ఇన్స్పెక్టర్ యుగంధర్, రూరల్ ఇన్స్పెక్టర్ మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 22 వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఆత్మకూరు సబ్ డివిజన్ జూపాడుబంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని మండ్లెం గ్రామం నందు సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 30 అక్రమ మద్యం క్వార్టర్ బాటిల్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు కార్డెన్ సెర్చ్ చేసిన పట్టణాలలో, గ్రామాలలో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత నేరాలపై అవగాహన కల్పిస్తూ, ఏవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసు అధికారులు హెచ్చరించారు. ప్రజల భద్రతకు పోలీసులు ఉన్నారనే భరోసా కల్పించేందుకే కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లు నిర్వహించడం జరుగుతుందని ఇవి నిరంతరం కొనసాగుతుంటాయని పేర్కొన్నారు.

# పాములపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని, ఇస్కాల గ్రామంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

**అసాంఘిక,సంఘ విద్రోహశక్తుల ఆట కట్టించి, నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే పోలీసుల లక్ష్యం.**

**అనుమానిత ప్రాంతాలు, అనుమానస్పద వ్యక్తుల ఇళ్ళల్లో విస్తృతంగా(సోదాలు) దాడులు.**

**14 మద్యం క్వార్టర్ బాటిళ్లు, 08 మోటార్ సైకిళ్ళు స్వాధీనం:-ఎం సురేష్ కుమార్ రెడ్డి(ఆత్మకూరు రూలర్ సిఐ), కే.సురేష్ బాబు (పాములపాడు ఎస్ఐ)**

**పాములపాడు మే 19 రిపబ్లిక్ న్యూస్:-**నంద్యాల జిల్లా ఎస్పీ-అధిరాజ్ సింగ్ రాణా(ఐపీఎస్) ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పి- ఆర్. రామంజినాయక్ సూచనలతో ఆత్మకూరు రూరల్ సీఐ- ఎం.సురేష్ కుమార్ రెడ్డి, పాములపాడు సబ్-ఇన్స్పెక్టర్- కె.సురేష్ బాబు మరియు సిబ్బంది ఆధ్వర్యంలో పాములపాడు మండలంలోని,ఇస్కాల గ్రామంలో నేటి తెల్లవారుజామున నేరనివారణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కార్డెన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది.ఈ సంధర్భంగా ఆత్మకూరు రూలర్ సీఐ- ఎం.సురేష్ కుమార్ రెడ్డి, పాములపాడు ఎస్సై- కే.సురేష్ బాబు లు మాట్లాడుతూ పాములపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని, అన్ని గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ మరియు నేరాలను నివారించడమే లక్ష్యంగా మరియు గ్రామాలలో ఎలాంటి గొడవలు అల్లర్లు జరగకుండా



నివారించుటకు, పోలీసులు ప్రజల కొరకు ఉన్నారనే భరోసా కల్పించడం కొరకు ఈ కార్డెన్ అండ్ సర్చ్ ఆపరేషన్ లు తరచూ నిర్వహిస్తున్నామని తెలియజేశారు.ఈ సెర్చ్ ఆపరేషన్ లో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది బృందాలుగా ఏర్పడి గ్రామంలోని అనుమానితులు, రౌడీ షీటర్లు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించి అక్రమ మద్యం 14 క్వార్టర్ బాటిళ్లను, మరియు సరైన ధ్రువపత్రాలు లేని 08 మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సీఐ- ఎం.సురేష్ కుమార్ రెడ్డి, ఎస్సై- కే.సురేష్ బాబు లు ఏవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, వాటి జోలికి పోకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లు నిరంతరం కొనసాగుతుంటాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ- జోసెఫ్, కానిస్టేబుళ్లు పి.చెన్నయ్య, షేక్షావలి, రామేశ్వరరావు, పవన్, శివ, టావేశ్వరుడు, హోమ్ గార్డ్ సుబ్బారావు, తదితర పోలీసు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# టిడిపి మండల కన్వీనర్ కె.మొహ్మద్ అదం కి ఇవ్వాలి

## ముస్లిం మైనారిటీల డిమాండ్

**హొళగుంద :: ప్రతినిధి మే 19 (రిపబ్లిక్ న్యూస్)**

కర్నూలు జిల్లా హొళగుంద మండలం తెలుగుదేశం పార్టీ హొళగుంద టిడిపి మండల కన్వీనర్ పదవిని ముస్లిం మైనార్టీ నాయకుడు కె మొహమ్మద్ ఆదంని ఇవ్వాలని కోరుచున్నాము గత 15 సంవత్సరాల నుంచి తను పార్టీ కోసం పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నారు అందుకు పార్టీ అధిష్టానం గుర్తించి హొళగుంద మండల కన్వీనర్ పదవి ని ముస్లిం మైనార్టీ నాయకుడు అయిన కె.అదం ని ఇవ్వాలని కోరుతూ కష్టపడిన వ్యక్తిని గనక మా కమ్యూనిటీకి న్యాయం చేయాలని కోరుచున్నము మరియు గత 15 సంవత్సరాల నుంచి పార్టీ ని ప్రాణంగా భావించి ప్రతి కార్యక్రమం దగ్గరుండి అందరిని



కలుపుకొని పనిచేస్తున్నారు సొంత వ్యాపారం వదులుకొని కుటుంబాన్ని వదులుకొని పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్నారు మరియు అంతే కాకుండా సమన్వయంగా కలుపుకొని మండల అభివృద్ధి కొరకు మరియు తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసే విధంగా పనిచేస్తున్నారు అంతే కాకుండా గత ప్రభుత్వంలో అధికారం ఉన్నపుడు కొంత మంది నాయకులు మరియు కార్యకర్తలు పార్టీ ని విడి వేరే పార్టీ మరినా ఇతను మాత్రం నా బ్లెడ్ యెల్లో బ్లేడ్ అనే ధీమా తో పార్టీ అభివృద్ధి కోసం పనిచేశారు ముఖ్యముగా గత 20 సంవత్సరాల నుంచి ముస్లిం సామాజిక వర్గానికి తెలుగుదేశం పార్టీలో సముచిత స్థానం లభించలేదు అందువలన ముస్లిం మైనార్టీలు కూడా తెలుగుదేశం పార్టీ కి మనకు సరైన నాయకుని అవసరం ఉంది కనుక అధిష్టానం మరియు ఆలూరు తాలూకా ఇన్చార్జి ముస్లిం మైనార్టీల మీద మంచి అభిప్రాయం కూడా ఉంది అందుకే ఈసారి ముస్లిం మైనార్టీలకు సీనియారిటీ ప్రకారం కష్టపడే వ్యక్తి కె.అదం ని ఎన్నుకోవాలని ముస్లిం మైనారిటీల తరుపున కూర్చున్నాము.

# కరెంటు షాక్ తో మృతి చెందిన యువరైతు మృతికి సంతాపం తెలిపిన మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి





**మంత్రాలయం మే20(రిపబ్లిక్ న్యూస్):-**మంత్రాలయం నియోజకవర్గం కోసిగి టౌన్ లోని 3వ వార్డు కి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త దొడ్డి రామయ్య కుమారుడు దొడ్డి నాగరాజు నిన్నటి రోజున పంట పొలాలలో నీరు కట్టడానికి వెళ్లి మోటర్ ఆన్ చేయబోతుండగా కరెంట్ షాక్ తగలడంతో మృతి చెందాడు.ఆ విషయం తెలుసుకున్న మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి మరియు వారి తనయులు టీడీపీ యువనాయకులు ఎన్. రాకేష్ రెడ్డి కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని యువరైతు మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ప్రభుత్వం నుండి అన్ని విధాలుగా ఆదుకుంటామని, మట్టి ఖర్చుల నిమిత్తం 10000 రూపాయలను ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కోసిగి టౌన్ నాయకులు ముత్తరెడ్డి ,పల్లెపాడు రామిరెడ్డి ,తోవి రామకృష్ణ, జ్ఞానేశ్ ,మాణిక్య రాజు,బిజెపి రాముడు,వక్రాని వెంకటేష్ ,చింతలగేని నర్సిరెడ్డి ,అరివిలి వీరేష్, వందగల్ కోసిగయ్య, సాతనూరు కోసిగయ్య,కోసిగి ఈరన్న,వీరారెడ్డి,ఉప్పలపాటి అర్జున్ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# .మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ ఉద్యగాలు కలిపిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదే

## జగన్ తన ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్టు కూడా ఇవ్వలేదు..

## -ఎం.పి బస్తిపాటి నాగరాజు

**కర్నూలు ప్రతినిధి మే 19 రిపబ్లిక్ న్యూస్**



రాష్ట్రంలో మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు కలిపిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్నారు.. నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఖ్యాతి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిఎస్సీ అభ్యర్థులకు నెల రోజుల పాటు కలిపిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు...ఈ సందర్భంగా ఎం.పి ఉచిత శిక్షణ తరగతుల పై నిర్వాహకులు, అభ్యర్థులతో చర్చించి, అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ బుక్కులను అందజేశారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు.ు గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని మండిపడ్డారు.. జగన్ తన ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్టు కూడా ఇవ్వలేదని విమర్శించారు... కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పాలన సాగిస్తుందన్న ఎం.పి నాగరాజు, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేష్ విద్యా రంగానికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు..

# ల్యాప్ టాప్ లను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు, ప్రతినిధి మే 19(రిపబ్లిక్ న్యూస్)**



ల్యాప్ టాప్ లను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా విద్యార్థులకు తెలిపారు.. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన ల్యాప్ టాప్ లను ఇద్దరు విద్యార్థినులకు కలెక్టర్ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్, డిగ్రీ తదితర ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్ టాప్ లను అందజేయడం జరుగుతోందన్నారు.. విద్యార్థులు ల్యాప్ టాప్ లు వినియోగించుకుని వారి కోర్సుల్లో నైపుణ్యం సాధించాలని, భవిష్యత్ లో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు..కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి అధికారుల పర్యవేక్షణ అవసరం

## -నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు

**కర్నూలు ప్రతినిధి మే 19 (రిపబ్లిక్ న్యూస్)**




సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కారమయ్యేంత వరకు సంబంధిత అధికారుల పర్యవేక్షణ అవసరమని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల సమస్యలకు సంబంధించి 26 అర్జీలను స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎంఈ సత్యనారాయణ, ఆర్ఓ జునైద్, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ అంజాద్ బాష, సర్వేయర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# చలో విజయవాడ పోస్టర్ విడుదల

**కర్నూలు ప్రతినిధి మే 19 (రిపబ్లిక్ న్యూస్)**




ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన చలో విజయవాడ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులు బంగి శ్రీధర్ పిలుపునిచ్చారు. కర్నూలు బిక్యాంపు కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. జూన్ 5 వ తేదీన విజయవడలో జరిగే సమావేశంలో పీఆర్సీ, ఐఆర్, డిఏ మరియు పెండింగ్ లో ఉన్న బకాయిలపై చర్చించి తీర్మానించనున్నామని ఆయన తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాల కోసం పోరాడే ఒకే ఒక సంఘం ఏపీజీఈఏ అని బంగి శ్రీధర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరి సురేష్ రెడ్డి, సిటీ అధ్యక్ష కార్యదర్శులు మురళీదర్ నాయుడు మరియు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యం ప్రజల చేతుల్లోకి పుస్తకావిష్కరణ.

**కాకినాడ జిల్లా ప్రతినిధి మే 19, (రిపబ్లిక్ న్యూస్)** : డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి రచించిన ప్రజల ఆరోగ్యం ప్రజల చేతుల్లోకి పుస్తకం ఆవిష్కరించి గ్రామీణ వైద్యులకు అందచేయటం జరిగింది.స్థానిక ఎస్టీయు విద్య భవన్ నందు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక పౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి రాజ్యాంగంపై కనీస అవగాహన ఆరోగ్య సూత్రాలు మరియు ప్రస్తుత కాలమాన పరిస్థితులు గురించి ప్రసంగించారు ప్రజల ఆరోగ్యం ప్రజల చేతుల్లోకి డాక్టర్ వెన్నపూస బ్రహ్మ రెడ్డి డాక్టర్ నన్నపనేని రమాదేవి తొమ్మిది వందల పేజీల బుక్కుని గ్రామీణ వైద్యులకు అందజేయడం జరిగింది కమ్యూనిటీ పారామెడి అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్




అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి విబి టి రాజు తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బల్ల శ్రీనివాసరావు కార్యదర్శి పి దేవానందం రామేశ్వరం ఎస్ కే బాబ్జి డాక్టర్ వెన్నపూస బ్రాహ్మ రెడ్డి సత్య స్కానింగ్ సెంటర్ అధినేత కాదా వెంకటరమణ చేతులు మీదుగా ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి అలయన్స్ చప్పిడి వెంకటేశ్వరరావు బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పదిలం బెన్ బాబు బి.ఎం.పి సీనియర్ నాయకులు సత్యానందం జన విజ్ఞాన వేదిక స్టీరింగ్ కమిటీ మెంబర్ కమ్యూనిటీ పారామెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ది పీఎంపి అసోసియేషన్ కాకినాడ జిల్లా మాజీ అధ్యక్షులు కొమ్మన తాతారావు సీనియర్ సభ్యులు లక్ష్మీనారాయణ కంపెనీ ఎస్ వి రామారావు తదితర గ్రామీణ వైద్యులు ఈ బుక్ ని తీసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు మరియు స్టీరింగ్ సభ్యులు పి సుబ్బరాజు కిరణ్మయి రామకృష్ణ అధిక సంఖ్యలో ఉపాధ్యాయ నాయకులు గ్రామీణ వైద్యులు ఇతర సంస్థల సభ్యులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు

## పిఠాపురం ఏరియా డవలప్మెంట్ అథారిటీ (పాడా) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో పాడా పీడీ

**కాకినాడ జిల్లా ప్రతినిధి మే 19, ( రిపబ్లిక్ న్యూస్)** ఎ.చైత్ర వర్షిణి పాల్గొని, పిఠాపురం పరిసర ప్రాంతాల ప్రజలు నుంచి వివిధ అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా పాడా పీడీ చైత్ర వర్షిణి మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ అంశాలపై 49 అర్జీలు అందాయన్నారు. ఇందులో రెవెన్యూ -13, మునిసిపాలిటీ-25, ఇతరములు -11 వచ్చాయని ఆమె తెలిపారు. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి



కృషి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ వసంత మాధవి, పిఠాపురం కమిషనర్ కనకారావు, తహసీల్దార్ గోపాల కృష్ణ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం పట్టణంలో "వైభవంగా జరుగుతున్న 'తిరుపతి గంగమ్మ " దేవాలయ జాతర లొ కూతురు ఉదయశ్రీ తో అన్నధానం నిర్వహించిన ఎల్. ఐ. సి. నరసింములు "





**కుప్పం నియోజకవర్గం 19 మే 25 (రిపబ్లిక్ న్యూస్):** ఈ రోజు కుప్పం పట్టణంలో కోలాహళంగా సాగుతున్న "తిరుపతి గంగమ్మ జాతర" లో పాల్గొంటున్న భక్తుల కై ఎల్. ఐ. సి. యూనియన్ కుప్పం తరఫున జరిగిన అన్నదానం కార్యక్రమం లొ ఎల్. ఐ.సి ఉద్యోగి వి. నరసింహులు తన కూతురు ఉదయశ్రీ తో పాల్గొని దాధాపు, ఐదు వందల భక్తులకి అన్నధానం అందించారు, ఈ కార్యక్రమంలో నరసింహులు గారితో వారి కూతురు ఉదయశ్రీ, వరద రాజులు , మోహన్ రెడ్డి , వెంకట్ రాముడు, రాజేష్ , ఉదయ్ కుమార్,ఎల్. ఐ. సి. కార్యాలయ సభ్యులు మరియు ఎల్. ఐ. సి. ఏజెంట్ మిత్రులు పాల్గొన్నారు!ద

# వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

### జాతీయ వడ్డెర సంఘం నాయకులు డాక్టర్ బత్తుల సంజీవరాయుడు డిమాండ్

**పాములపాడు మే 19 రిపబ్లిక్ న్యూస్**

కర్నూలులో రాయలసీమ ఒడియా రాజుల ప్రతినిధుల సమావేశం జరిగిందని అందులో వడ్డెర్లందరూ పాల్గొన్నారు అని , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జాతీయ వడ్డెర సంఘం నాయకులు డాక్టర్ బత్తుల సంజీవరాయుడు డిమాండ్ చేశారు.వడ్డెర సంఘ నాయకులకు రాయలసీమ సూర్యవంశపు క్షత్రియ కలింగ గజపతి వడియ రాజుల ప్రతినిధుల సమావేశం జరిగిందని వేదిక బీ- వడ్డెర సంఘ భవనం లోముఖ్య అతిథులు సూర్యవంశపు కాలసూర్య

శ్రీ రాజా వీర దేవరాజు, బెంగళూరు , బత్తుల లక్ష్మీకాంతయ్య,, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ,, మక్కల శ్రీనివాసులు,కర్నూలు జిల్లా వడియరాజుల సంక్షేమ సంఘం అధ్యక్షులు,, %ు%.వెంకటయ్య కర్నూలు జిల్లా సిటీ ప్రెసిడెంట్, అంశాలుబీ- 1. సూర్యవంశపు ఒడియ రాజుల క్రీస్తుశకం 1434 నుంచి 1541 వరకు పాలన గురించి , చలనచిత్ర




దృశ్యం ప్రదర్శించ బడింది.

2. వడ్డెర్ల సుస్థిర జీవనస్థితిగతులు ు ప్రభుత్వాల సహకారం,3. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర్ల ఆర్థిక, సామాజిక, విద్యా ,ఉద్యోగ, రాజకీయ అవకాశాలు . 4. ఆంధ్ర రాష్ట్రంలో వడ్డెరలను ఎస్టీ లో చేర్చడానికి కార్యాచరణ ప్రణాళిక , వడ్డెర కార్పొరేషన్ కు 250 కోట్ల నుంచి 500 కోట్ల బడ్జెట్ను కేటాయించాలని , మైనింగ్ గనులు వడ్డెర్లకు 25 శాతం రిజర్వ్ చేయాలని , కాంట్రాక్టు వర్కులు 15% నామినేషన్ పద్ధతిన డిపాజిట్ లేకుండా కేటాయించాలని రాయలసీమలోని వడ్డెర్లందరూ ఈసమావేశంలో పాల్గొని చర్చించడం జరిగిందన్నారు, పై అంశాలన్నిటినీ క్రోడీకరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారు కుంచపు శ్రీనివాసులు , జిల్లా ప్రచార కార్యదర్శి , కర్నూలు జిల్లా ఒడియ రాజుల సంక్షేమ సంఘం , దేరంగుల లక్ష్మీనారాయణ, జిల్లా వడ్డెర సంఘం నాయకులు

కుంచపు జానకిరామ్ , రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు

పల్లపు నాగేశ్వరరావు , జిల్లా వడ్డెర సంఘం నాయకులు శిల్పి సుబ్బరాయుడు, బ్యాంకు నాగరాజు , గుంజా వెంకటస్వామి , డీవీ చంద్ర , వెంకటేశ్వర్లు , భైరవ, నడిపి వెంకటేశ్వర్లు, బట్టల అంగడి సుబ్బరాయుడు , బ్రహ్మంగారిమఠం నుండి రామాంజనేయులు , చంద్రిక, శిల్పి రాజు , పలుకూరు శివకృష్ణ , బత్తుల పృథ్వీరాజు , వెంకటేశ్వర్లు ,తదితరులు పాల్గొన్నారు

## ఆనందాపురం బ్రిడ్జిని నిర్మించి దళిత ప్రజల ప్రాణాలు కాపాడండి...

### జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు అలియాస్ స్వాములు

**పాములపాడు మే 19 రిపబ్లిక్ న్యూస్:-** ఆనందపురం బ్రిడ్జిని నిర్మించి దళిత ప్రజల ప్రాణాలు కాపాడాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు అన్నారు పాములపాడు మండలంలో ఎమ్మార్వో ఆఫీసులో జరిగే స్పందన కార్యక్రమంలో



ఎమ్మార్వో సుభద్రమ్మ గారికి వినతి పత్రం సమర్పిస్తూ ఈ సందర్భంగా డివిఎంసి మెంబర్ నాగరాజు మాట్లాడుతూ నంద్యాల జిల్లా పాములపాడు మండలం ఆనందపురం గ్రామం దగ్గర కేసీ కెనాల్ పై బ్రిడ్జి బ్రిటిష్ కాలం నాటిదని ఆ బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని వర్షాలు పడితే కూలిపోతుందని ఆయన అన్నారు. గ్రామ దళిత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని కర్నూల్ నుండి కడప వరకు ఉన్న వారాధులు చాలా ఉండేవని అయితే వైయస్సార్ ప్రభుత్వం ప్రభుత్వంలో పని చేసే నాయకుల గ్రామాల దగ్గర ఉన్న వారాదులను నిర్మించింది కానీ దళిత ప్రజలు నివసిస్తున్న ఆనందపురం గ్రామానికి మాత్రం బ్రిటిష్ కాలం నాటి వారదే ఉందని ఆయన అన్నారు. ఈ బ్రిడ్జిపై రైతులు రైతు కూలీలు జూటూరు ఆనందపురం వ్యవసాయ పనుల నిమిత్తం నిరంతరం తిరుగుతూ ఉంటారని కర్నూలు టు కడప వరకు ఉన్న వారధుల స్థానంలో కొత్త బ్రిడ్జిలు నిర్మించిన దళిత ప్రజలు నివసించే ఆనందపురం గ్రామానికి బ్రిడ్జి ఎందుకు నిర్మించలేదని ఆయన అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు గతంలో బ్రిడ్జి నిర్మించడానికి దిమ్మెలు వేసిన కాంట్రాక్టర్ పైచర్యలు తీసుకొని వెంటనే గతంలో వేసిన దిమ్మెలపైస్లాప్ వేసి కొత్త బ్రిడ్జి నిర్మించాలని ఆయన అధికారులు కోరారు

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

### కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 128 ఫిర్యాదులు.

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... ఎస్పీ.

కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మే 19) కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 128 ఫిర్యాదులు వచ్చాయి.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...

కర్నూలు జోహారాపురం కు చెందిన శ్రీనివాసులు, క్రిష్ణగిరి గ్రామానికి చెందిన ఆవుల రామాంజనేయులు కలిసి 7 మంది నుండి మొత్తం సుమారు రూ. 10 లక్షల వరకు డబ్బులు తీసుకొని వెల్దుర్తి, చిట్యాల, సూదే పల్లె, అమకతాడు పాఠశాలల్లో అటెండర్లుగా , రికార్డ్ అసిస్టెంట్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో నకిలీ పత్రాలు సృష్టించి మా పిల్లలకి ఉద్యోగాలు ఇప్పించి మధ్యపెట్టి 7 నెలలు పాఠశాలల్లో పని చేయించుకుని జీతాలు ఇవ్వకుండా, ఉద్యోగాలు ఇప్పించకుండా మోసం చేశారని డోన్ మండలం కు చెందిన ఎరుకల శేషన్న ఫిర్యాదు చేశారు.

ఓరకల్లు మండలం , కన్నమడకల గ్రామానికి చెందిన రామకృష్ణ అను వ్యాపారి 95 షేర్ల నకిలీ ఉల్లి విత్తనాలు ఇచ్చి పలువురు రైతులను మోసం చేశాడని , కడప జిల్లా , పెండ్లి మర్రి గ్రామానికి చెందిన నాగ మల్లారెడ్డి ఫిర్యాదు చేశారు. ఇల్లు కట్టిస్తామని చెప్పి ఒక వ్యక్తి అడ్వాన్సుగా



డబ్బులు తీసుకొని ఇంతవరకు ఇల్లు కట్టించకుండా మోసం చేస్తున్నాడని గూడూరు కు చెందిన యుగంధర్ రెడ్డి ఫిర్యాదు చేశారు.నా తమ్ముడు విరుపాక్షి తో కలిసి డబ్బులు అవసరం ఉందని బంగారు ఆభరణాలు తీసుకెళ్లి కర్నూలు **Fed bank services private limited** లో తాకట్టు పెట్టి లోన్ తీసుకున్నాము. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించడానికి బ్యాంకు కు వెళ్ళినప్పుడు నాకు తెలియకుండానే మా బంగారు ఆభరణాలు రిలీజ్ చేసి ఇచ్చినట్లు తప్పుగా నమోదు చేసిన బ్యాంక్ అధికారుల మీద చర్యలు తీసుకుని నా బంగారు ఆభరణాలు తిరిగి ఇప్పి%శీ%చగలరని కర్నూల్ మండలం, నిడ్జూర్ గ్రామానికి చెందిన టి. నాగేశ్వర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. నా తమ్ముళ్ళ పొలం దాటి పూర్వం నుండి నా పొలానికి రస్తా ఉంది. నా తమ్ముళ్లయిన శ్రీరాములు, రాముడు, నర్సింహులు నన్ను నా పోలానికి పోనీయకుండా రస్తా లేదంటూ అడ్డుపడుతున్నారని న్యాయం చేయాలని కర్నూలు మండలం, జి . సింగవరం గ్రామానికి చెందిన ఈ. మద్దిలేటి ఫిర్యాదు చేశారు. మా కోడలు సంధ్య మమ్మల్ని సరిగా



చూసుకోవడం లేదని ప్రవర్తనలో మార్పు వచ్చే విధంగా కౌన్సిలింగ్ చేయాలని గోనెగండ్ల మండలం, పెద్ద మర్రివీడు గ్రామానికి చెందిన కే. లక్ష్మణరావు ఫిర్యాదు చేశారు. మా నుండి ఉల్లిపాయల సరుకు తీసుకున్న నంది ఆనియన్ ట్రేడర్స్ వారు మాకు డబ్బులు ఇవ్వడం లేదు . మార్కెట్ యార్డ్ లో దాదాపు 50 మంది కమీషన్ ఏజెంట్ల నుండి రూ. 1 కోటి 80 లక్షల రూపాయల ఉల్లిపాయల సరుకు తీసుకొని మాకు డబ్బులు ఇవ్వడం లేదు . డబ్బులు అడిగితే నష్టం వచ్చిందని మోసం చేయాలనే ఉద్దేశంతో మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని కర్నూల్ బుధవారం పేటకు చెందిన సాంబశివుడు ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సిఐ లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గోడ పత్రికలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**నందికొట్కూరు, మే 19, (రిపబ్లిక్ న్యూస్) :** ఛలో విజయవాడ కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి పాల్గొనాలని నందికొట్కూరు నియోజకవర్గ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షులు ఆర్ నర్సరాజు పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చలో విజయవాడ గోడ పత్రికలను ఎమ్మెల్యే గిత్త జయసూర్య నందికొట్కూరు నియోజకవర్గ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదేల పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు జూన్ 5న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలకు హాజరవుతున్నారని వారు పేర్కొన్నారు. ఇప్పటికీ మరియు ఎప్పటికీ ఉద్యోగుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఏకైక సంఘం ఏపీ జి ఈ ఏ అని కొనియాడారు. జూన్ 3న జరిగే కౌన్సిల్ మహాసభల్లో కె.ఆర్.సూర్యనారాయణ నాయకత్వాన్ని బలపరచాలని, నందికొట్కూరు నియోజకవర్గంలో ఉన్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యదర్శి భువనేశ్వరి, కోశాధికారి రాముడు, ఉపాధ్యక్షులు మద్దిలేటి, గుట్టలయ్య, మహబూబ్ భాషా,కృష్ణమూర్తిలు జాయింట్ సెక్రటరీ సిరాజ్ అహమ్మద్, జాకీర్ హుస్సేన్ మరియు వి ఆర్ ఓ లు ఆనంద్, మనోహర్, బుద్ధకవి, అంజాద్ భాషా, రంగన్న, ఇరిగేషన్ ఉద్యోగులు చంటి గిరీష్ కుమార్ , కామేశ్వర ప్రసాద్ మరియు తాలుకా లోని వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# "దళిత విద్యార్థి జేమ్స్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం"

### బాధిత కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి

### : చిత్తూర్ జిల్లా రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా భీమారావు అంబేద్కర్ అధ్యక్షులు పార్థ సారథి!

**చిత్తూర్ టౌన్ 19 మే 2025( రిపబ్లిక్ న్యూస్ ):** పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్ పై జరిగిన పాశవిక దాడిని రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా ( భీమారావు అంబేద్కర్) తీవ్రంగా ఖండిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సొంత జిల్లాలోనే ఇటువంటి అమానుష చర్యలు జరుగుతుండటమే దళితుల పై ఉన్న అసహనం మరియు అణచివేతను చూపిస్తోంది. "జేమ్స్, నెల్లూరు జిల్లా రాజుపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి, శ్రీ విద్యానికేతన్ కాలేజీలో బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్నాడు, గతంలోనే కుల దుర్భాషలతో వేధింపులు ఎదుర్కొన్న జేమ్స్, తాజాగా 14/5/25 అర్ధరాత్రి కొంతమంది రౌడీ షీటర్ల చేతిలో అమానుష హింసకు గురయ్యాడు. కరకంబాడి రోడ్డులో దాడి చేసిన వారు బ్లేడ్లతో కోసి, బురదలో తొక్కించి, హొటల్ గదిలో బట్టలు విప్పి చిత్రహింసలు పెట్టారు.




ఈ దాడికి ప్రధాన హంతకులుగా యశ్వంత్, చోటా బ్లడ్, రూపేష్, సాయి, కిరణ్ తదితరులు ఉన్నారు. జేమ్స్ స్నేహితుడు సాయి రెడ్డి కూడా ఈ దాడికి గురయ్యాడు,బాధితులకు తక్షణంగా న్యాయం జరగాలి అంటూ రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా ( భీమా రావు అంబేద్కర్,)తరపున కోరుకుంటున్నారు :

-దళిత విద్యార్థి జేమ్స్ పై దాడిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం 1989 కింద నమోదు చేసిన కేసుని, సమగ్ర విచారణ జరపాలి!

– ప్రధాన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించాలి.

ఏబాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు నష్టపరిహారం, భద్రత కల్పించాలి.

-నిందితుల కుటుంబాలను పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి నుంచి బహిష్కరించాలి.

-.తిరుపతిలో విద్యాసంస్థల్లో దళితులపై జరుగుతున్న కుల వేధింపులపై ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలి.

అంటూ రిపబ్లిక్ మీడియా తో రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా( భీమా రావు అంబేద్కర్) చిత్తూర్ జిల్లా అధ్యక్షులు పార్థ సారథి తెలిపారు!

# ధర్మపురి నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

## - పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**జగిత్యాల జిల్లా ప్రతినిధి,మే 19( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని ఎండపల్లి, గొల్లపల్లి మండల కేంద్రాల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ వైద్య చికిత్స కోసం స్థోమత లేని వారి పాలిట ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్) పథకం వరం లాంటిదని పేర్కొన్నారు. ఎండపల్లి మండలంలో 96 మందికి రూ. 27,87,500/- విలువగల చెక్కులను, గొల్లపెల్లి మండలంలో 102 మందికి రూ.31,58,500/- విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో వెల్గటూర్, గొల్లపెల్లి మండలాల ఏఎంసీ చైర్మన్ లు గుండాటి గోపిక జితేందర్ రెడ్డి, భీమ సంతోష్, మండల పార్టీ అధ్యక్షులు శైలేందర్ రెడ్డి, నిశాంత్ రెడ్డి, నాయకులు గోల్ల తిరుపతి, పోలోజు శ్రీనివాస్, బోరకుంట రాజయ్య, అనుమాల మంజుల, ద్యావ మహిపాల్ రెడ్డి, సందీప్ రెడ్డి, గెల్లు శ్రీనివాస్, గాజుల విజయ్, రంగు తిరుపతి గౌడ్, బిసగోని సత్యం, ఆయా మండలాల తహసిల్దార్ లు, ఎంపీడీవోలు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాధికారి కి శ్రీ కాళేశ్వరం లడ్డు, శ్రీ సరస్వతీ నదీ మహా పుష్కరాల త్రివేణి సంగమ పవిత్ర జలం అందజేత...



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 19( రిపబ్లిక్ న్యూస్):** జగిత్యాల జిల్లా విద్యాశాఖాధికారి కే. రాము నాయక్ కు, సెక్టోరల్ ఆఫీసర్ రాజేష్ కు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ రాష్ట్ర శాఖ సహాధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి చంద సత్యనారాయణ లు శ్రీ కాళేశ్వరం లడ్డూ ప్రసాదం, శ్రీ సరస్వతీ నదీ మహా పుష్కరాల త్రివేణి సంగమ పవిత్ర జలం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి లో, సనాతన ధర్మం లో ఆధ్యాత్మికతకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత, ఆత్మబలం లభిస్తుందని అన్నారు. ఈ నెల -15 నుండి 26 వరకు జరిగే శ్రీ సరస్వతీ నదీ మహా పుష్కరాల లో పవిత్ర స్నానం సకల శుభదాయకమని, పుణ్య స్నానాలు ఆచరిస్తే సకల దోషాలు తొలగిపోయి మాతృ పితృ దేవతలకు మోక్షం లభిస్తుందని మన పూర్వీకులు, పెద్దలు తెలియజేసారని అన్నారు.

# అందరిప్రియనేస్తం టీ"(తేనీరు).

ప్రాంతాలకు అతీతంగా...
కొత్తవారిని పరిచయం చేసే మన ఆప్తమిత్రుడు టీ..!
మస్తిష్కంలోని సమస్యలతో సతమతమౌతుంటే
అమ్మ చేతి స్పర్శలా మనసుకు ఉపశమనం కల్పించే
మన ఆప్తమిత్రుడు టీ ..!
ప్రతి విద్యార్థి కనురెప్పలపై దాడిచేస్తున్న నిద్దురను
తరిమేస్తూ చదువుల్లో సహకరించు మన నేస్తం టీ ..!
దేశ సరిహద్దుల్లో మంచుకొండల్లో పహారా కాస్తున్న
సైనికులకు ఆపద్బాంధవుడులా నేనున్నా నంటూ
వెచ్చగా గొంతులోకిజారిపోతూ...
నూతనోత్తేజం అందించు మన ఆప్తమిత్రుడు టీ ..!
అమీరు గరీబు అనే తారతమ్యం లేక
అందరినీ ఉషోదయ వేళ పలుకరిస్తూ ..
జోష్ నింపే మన అమృత నేస్తం టీ ..!
పున్నమి వెన్నెల రేయిలో సన్నగా వీచే చల్లగాలిలో
మదిలో మరుగున పడిన జ్ఞాపకాల మమతలను
గుర్తుకు తెచ్చే మన ఆప్తమిత్రుడు టీ ..!
మనం ముద్దుగా పిలుచుకునే"టీ"(తేనీరు)..
మనందరికీప్రియనేస్తం టీ

**రచన: శ్రీమతి మంజుల పత్తిపాటి (కవయిత్రి). మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్. యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.**



# వివాహ వేడుకల్లో పాల్గొన్న పీఎస్ఆర్



**జగిత్యాల జిల్లా ప్రతినిధి,మే 19 ( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని జగదేవ్ పేట గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ సింగిరెడ్డి తిరుపతిరెడ్డి కుమారుడు సాయి కిరణ్ రెడ్డి - స్రవంతి ల వివాహం జగిత్యాల ఏ బి కన్వెన్షన్ లో జరగగా, ఈ వివాహ మహోత్సవానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, వెల్గటూర్ మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు బాపు( పిఎస్ఆర్) హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు నూనె శ్రీనివాస్, నాయకులు లక్కాకుల శ్రీనివాస్, చింతకింది అనిల్ తదితరులున్నారు.

## విద్యుత్ షాక్ తో రైతు మృతి

### - ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు తొలగిస్తుండగా ప్రమాదం



రాజేందర్ రెడ్డి ( ఫైల్ ఫోటో )

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 19 ( రిపబ్లిక్ న్యూస్)**
తన వ్యవసాయ భూమిలో ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను, గడ్డిని తీసివేస్తుండగా ప్రమాదవశత్తు విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి చెందిన సంఘటన జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని నంచర్ల గ్రామంలో చోటుచేసుకుంది. పెగడపల్లి ట్రైనీ ఎస్సై రవీందర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గా మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన రైతు ఎడ్ల రాజేందర్ రెడ్డి తన వ్యవసాయ భూమిలో ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను, గడ్డిని తీసేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలాడు. గమనించిన తోటి రైతులు అంబులెన్స్ ద్వారా జగిత్యాల ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు రాజేందర్ రెడ్డి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య ఎడ్ల వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైన్ ఎస్సై రవికుమార్ పేర్కొన్నారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే రాజేందర్ రెడ్డి మృతి పట్ల నంచర్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని కూతురు గత ఆరు నెలల క్రితం ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లగా, అంతలోనే తండ్రి మృతి చెందడం గ్రామస్తులను కలచి వేసింది.

## జగిత్యాల డీఎస్పీగా ఎన్. వెంకటస్వామి.

### - డిఎస్పీ రఘుచందర్ బదిలీ



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 19 ( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల డి.ఎస్.పి రఘు చందర్ ను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జగిత్యాల డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న రఘు చందర్ ను ఇంటలిజెన్స్ డిఎస్పీగా బదిలీ చేశారు. కాగా జగిత్యాల డిఎస్పీగా ఎన్.వెంకటస్వామి నియమితులయ్యారు. ఎన్.వెంకటస్వామి రామగుండం సిసిఎస్ ఏసీపీగా, కరీంనగర్ టౌన్ ఏసీపీగా అదనపు బాధ్యతలు చేపడుతుండగా, ఆయనను జగిత్యాల డిఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# ఆదివాసి మహిళ కి అంత్యక్రియలు




**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో మే 19 ( రిపబ్లిక్ న్యూస్)** ఇచ్చోడ మండలం గుబ్బ గ్రామం కి చెందిన పూసం అనసూయ బాయి వయసు 50 సం లు కొంత కాలంగా ఇచ్చోడా లో ఇంట్లో పనిమనిషి గ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తుంది తన భర్త కూడా చనిపోవడం జరిగిగింది అప్పటి నుండి తన కూతురు పుసం లక్ష్మీ (17 సం) తో జీవనం కొనసాగిస్తుంది నిన్న రాత్రి విద్యుత్ షాక్ తో మృతి చెందింది అయితే మృతదేహం ను పోస్టుమార్ధం నిమిత్తం బోథ్ లోనీ ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకొని వచ్చారు ఆదివాసీ మహిళా మృతురాలి కి కూతురు తప్ప ఎవరు లేకపోవడం తో అంత్యక్రియలు కూడా చేయలేని స్థితిలో ఉన్నారు అయితే ఈ విషయం తెలుసుకున్న ఆదివాసీ నాయకులు మరియు తుడుం దెబ్బ నాయకులు , రిపోటర్ కొత్తూరీ లక్ష్మణ్,బోథ్ లోని మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ను సంప్రదించగా అంత్యక్రియలు నిర్వహించాలని కోరగా వెంటనే స్థానిక మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మరియు తుడుం దెబ్బ నాయకులు కలిసి మృతదేహం కి పోస్టుమార్ధం చేయించి స్మశాన వాటికలో అంత్యక్రియలు చేశారు ఇలా ఆదివాసి మహిళా మృతు రాలికి అంత్యక్రియలు చేయటానికి సహకారం అందించారు మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్, కి తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కోడప నగేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్, ఇచ్చోడ మండల వైస్ ఎంపీపీ జైలై జాకూ, ఇచ్చోడ పర్దన్ మండల అధ్యక్షుడు గెడం మధుకర్,కనక అమృత్ రావు బోథ్ మండల తుడం దెబ్బ అద్యక్షుడు, తుడం దెబ్బ నాయకులు సిడం మురళి కృష్ణ , ఇచ్చోడ మాజీ ఎంపీటీసీ జావిద్ , వజిద్ మరియు రిపోర్టర్ లక్ష్మణ్ మరియు చైల్డ్ వెల్ఫేర్ కో ఆర్డినేటర్ ఎర్రోల సతీష్ పాల్గొన్నారు. మరియు కో ఆర్థినేటర్ సతీష్ మృతురాలి కూతురు లక్ష్మీ కీ చదువుకి మరియు వసతి ఆశ్రయం అందిస్తాం అని తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులు, దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలి

### - జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్.



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 19( రిపబ్లిక్ న్యూస్ )**
ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు, ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి పిర్యాదులు, వినతులను జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్. మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 43 పిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి ఎస్ లత,ఆర్డీఓలు మధు సూధన్, దివాకర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్ దార్ లు ,కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బైపాస్ రింగ్ రోడ్డు కోసం స్థలాలు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించండి..




**తాండూరు 19 మే (రిపబ్లిక్ న్యూస్)** తాండూరుబైపాస్ రింగ్ రోడ్డు కోసం ప్రజల నుండి ప్రభుత్వం ప్లాట్ల స్థలాలు తీసుకొని భూ బాధితులకు చెల్లించవలసిన నష్టపరిహారం వెంటనే చెల్లించాలని తాండూర్ సబ్ కలెక్టర్ కు సోమవారం భూ బాధితులు, సీపీఎం నాయకుల తో కలసి వినతి పత్రం అందజేజరు. ఈ సందర్బంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాస్ మాట్లాడుతూలి కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల నుంచి అభివృద్ధి పనుల చేస్తున్నమని గొప్పలు చెప్పుకుంటూ ప్రజల దగ్గర నుండి ప్లాట్ల స్థలాలు తీసుకొని తాండూర్ లో బైపాస్ రింగ్ రోడ్ కోసం కోకాట్ అంతారం చెంగోల్ మిగతా గ్రామాల ప్రజల నుండి ప్లాట్ల జ తీసుకొని నష్టపరిహారం ఇవ్వకుండా కలయపన చేయడం పై మండిపడ్డారు. గతంలో ఉన్న ప్రభుత్వం ప్రజల నుండి భూములు తీసుకొని బాధితులకు నష్టపరిహారం చెల్లించకుండా నిర్లక్ష్యానికి గురి చేసరని అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా భూ బాధితులకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా భూములు తీసుకొని ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న వారిని అధికారులు పట్టించుకోకుండా బాధితులకు చెల్లించకుండా నిర్లక్ష్యానికి గురి చేస్తూ చేస్తున్న ప్రభుత్వ అధికారుల జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ప్లాట్లు కోల్పోయిన బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు భూ బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించలేక పొతే ప్లాట్లు కోల్పోయిన బాధితులు సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం హెచ్ పి ఎస్ తాండూర్ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ సాదిక్, సిపిఎం నాయకులు బాలస్వామి, సురేష్, ప్లాట్ల బాధితులు యాసిన్, రమేష్, శ్రీనివాస్ ,బాల్ రెడ్డి, వెంకటమ్మ, రాజు, నర్సింలు, వెంకటేష్, అశోక్, అనంతమ్మ, శేఖర్ తదితులున్నారు

# హైలెవల్ బ్రిడ్జి పనుల ప్రారంభం

## - దారి మళ్లనున్న వాహనాలు

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 19( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల భావి సమీపంలో గల హైలెవల్ బ్రిడ్జి పనులు మొదలవుతున్నాయని, భారీ వాహనాలను దారి మళ్లీస్తున్నామని నేషనల్ హైవే ఆథారిటి కరీంనగర్ అధికారులు పేర్కొన్నారు. మే 21 నుంచి జులై 31 వరకు ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు నడుస్తాయని, భారీ వాహనాలను నిజామాబాదు - జగిత్యాల బైపాస్ గుండా, 4, 2 చక్రాల వాహనాలను బీట్ రోడ్డు, గుట్ట రాజేశ్వర స్వామి టెంపుల్ దారి గుండా మళ్ళి స్తున్నామని అందరు సహకరించాలని హైవే అధికారులు ఓ ప్రకటనలో కోరారు.

# జూన్ 21 వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

## మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించాలి -రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్

**కర్నూలు, ప్రతినిధి మే 19: (రిపబ్లిక్ న్యూస్)**
జూన్ 21 వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఇందులో భాగంగా జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం సెక్రటేరియట్ నుండి అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లు,స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, కోర్టు సముదాయాలలో మరుగుదొడ్ల నిర్మాణం, ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయం అంశాల పై చీఫ్ సెక్రటరీ జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జూన్ 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాన్ని విశాఖపట్టణంలో నిర్వహిస్తారని, ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారు.. జిల్లాల్లో గ్రామ గ్రామాన ప్రజలు యోగా దినోత్సవంలో పాల్గొనేలా, విజయవంతంగా యోగా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని సి.ఎస్ ఆదేశించారు.






మే 21 న యోగా దినోత్సవం కర్టెన్ రైజర్ గా ప్రతి జిల్లాలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు.. ప్రతి మండలంలోనూ మాస్టర్ ట్రైనర్లను గుర్తించాలని సూచించారు.. మే 21 నుంచి 27 వరకు జిల్లా స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఉంటుందని, మే 28 నుంచి జూన్ 3 వరకు మండల స్థాయిలోనూ, జూన్ 4 నుంచి జూన్ 16వ తేదీ వరకు గ్రామస్థాయిలో ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు..యోగా పై అవగాహన కలిగే విధంగా ర్యాలీలు,రంగోలి, కాంపిటీషన్స్ నిర్వహించాలని సీ ఎస్ అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించి పెద్ద పెద్ద పనులను స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేయడం జరుగుతుందని, ఆయా జిల్లాలకు సంబంధించి ప్రాజెక్టు పనులలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీ ఎస్ ఆదేశించారు. జిల్లా కోర్టులు, సబార్డినేట్ కోర్టులలో దెబ్బతిన్న మరియు కొత్త టాయిలెట్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు సేవలపై వచ్చే ప్రజా స్పందనలపై తేలికగా తీసుకోకుండా జిల్లా కలెక్టర్లు సమీక్ష చేసి నిరంతరం పర్యవేక్షణ చేయాలని సీ ఎస్ ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 67 ఫిర్యాదులు

## విచారణ జరిపి ఫిర్యాదుదారులకు చట్ట పరిదిలో న్యాయం చేస్తాం







**నంద్యాల క్రైం, మే 19, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించడం జరిగింది. నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు గారు ఫిర్యాదిదారుల నుంచి 67 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

# చిరస్మరణీయుడు పుచ్చలపల్లి సుందరయ్య



**రిపబ్లిక్ న్యూస్ అనంతపురం మే 19 :**
కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత స్వాతంత్ర సమరయోధులు అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి వర్ధంతి సభను నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ... దేశంలో అత్యంత ఆదర్శవంతమైన నాయకుల్లో అగ్రగామిగా సుందరయ్య ఉంటాడని, రాజకీయ విభేదాలతో నిమిత్తం లేకుండా ఆయనను అభిమానించేవారు చాలా ఎక్కువ మంది ఉంటారని తెలిపారు. భారత దేశ చరిత్రలోనే ఇలాంటి అరుదైన నాయకులు బహు కొద్ది మంది మాత్రమే ఉంటారని అందుకే కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ను కమ్యూనిస్టు గాంధీగా ప్రజలు చెప్పుకుంటారని తెలిపారు. చిన్నతనంలోనే స్వతంత్ర పోరాటంలో పాల్గొని బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడినారని తెలిపారు. నిజాం నవాబు పాలనకు వ్యతిరేకంగా పేద రైతులను వ్యవసాయ కార్మికులను కలుపుకొని తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపి వేల ఎకరాలను పేదలకు పంచడం ఒక్క సుందరయ్య కు మాత్రమే సాధ్యమైనదని తెలిపారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత మొదటి పార్లమెంట్లో ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించిన వారిగా ఇప్పటికీ సుందరయ్య పేరును చెప్పుకుంటున్నారని తెలిపారు. అందుకే సుందరయ్య మరణించి 40 సంవత్సరాలు అవుతున్న ఆయన చిరస్మరణీయునిగా ప్రజల మనసుల్లో ఉన్నాడని తెలిపారు. నగరంలో.పలు కాలనీ వాసులు సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్ర కుమార్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు వలీ ,మసూద్ ఇర్ఫాన్ నగర కమిటీ సభ్యులు ఎర్రి స్వామి, లక్ష్మీనారాయణ, ఏటీఎం నాగరాజు, లక్ష్మీనరసమ్మ, ఎన్టీఆర్ సీనా ,అశ్విని, గఫూర్ జే వి వి నాయకులు తిరుపాలు, ఉపాధ్యాయులు గోవిందరాజులు, రమణయ్య, కోటేశ్వరప్ప, దేవిడ్ ,రాము, ఆది,శంషాద్, హాజీ వలి, శంకర, సిద్దు, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్త తెలుగుదేశం పార్టీ అధినేత

### - కష్టపడి పని చేసిన వారికి అత్యున్నత పదవులు

### - మహానంది మండల టిడిపి అధ్యక్షుడిగా కంచర్ల శివశంకర్ చౌదరి



**మహానంది, మే 19, (రిపబ్లిక్ న్యూస్):**
ప్రతి కార్యకర్త తెలుగుదేశం పార్టీ అధినేత అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. ఆత్మకూరులో సోమవారం జరిగిన మహానాడు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల అభ్యర్థులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు పార్టీలో అత్యున్నత పదవులు కల్పించడంతో పాటు మంచి స్థానం కల్పిస్తామని అన్నారు. నూతన పార్టీ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు

**మహానంది మండల టిడిపి కన్వీనర్ గా కంచర్ల శివశంకర్ చౌదరి**
మహానంది మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా కంచర్ల శివ శంకర్ చౌదరి నియమితులయ్యారు. సోమవారం ఆత్మకూరులో జరిగిన నియోజకవర్గ మహానాడు కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి టీడీపీ మహానంది మండల అధ్యక్షుడిగా బుక్కాపురం గ్రామానికి చెందిన కంచర్ల శివశంకర్ చౌదరిని నియమించినట్లు తెలిపారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా గాజులపల్లె గ్రామానికి చెందిన రాజశేఖర్ నాయక్ ను నియమించామన్నారు. ఈ సందర్భంగా కంచర్ల శివశంకర్ చౌదరి మాట్లాడుతూ పార్టీలోని అందరిని కలుపుకుంటూ పార్టీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. వ్యక్తిగత విభేదాలు పక్కన పెట్టి పార్టీ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో టిడిపి బలోపేతానికి తన వంతు సహాయ సహకారాలు అందించడంతో పాటు అన్ని వర్గాల వారి అభివృద్ధికి సేవలు అందిస్తానన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల ప్రతినిధి, మే 19, రిపబ్లిక్ న్యూస్ :-**
ఈ నెల 21వ తేది నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో అందరి చేత యోగ నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్, అంతర్జాతీయ యోగా దినోత్సవం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో అందరి చేత యోగ నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయడంతో పాటు అందరికీ ఆహ్వాన కార్డులు అందజేయాలని డిఆర్ఓను కలెక్టర్ ఆదేశించారు. ఇండోర్ స్టేడియంతో పాటు పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున శానిటేషన్



చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. అదే విధంగా యోగ డే కోసం చక్కటి బ్యాక్ డ్రాప్ ఏర్పాటు చేసి కర్టెన్ రైజర్స్ సిద్ధం చేయాలని డిఎస్డిఓ, డిఎంహెచ్ఓ, మున్సిపల్ కమీషనర్ లను ఆదేశించారు. అలాగే కార్యక్రమంలో యోగ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులను, యోగా కోచ్ లను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలన్నారు. నెల రోజుల పాటు జరిగే యోగ కార్యక్రమాలకు జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలిసి వుందన్నారు.
అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ స్టేట్ ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూప్ ద్వారా రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రాజెక్టుల్లో పురోగతి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. 50 కోట్లకు పైబడి ఉన్న ప్రాజెక్టులను నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో సమీక్ష చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఈ సమీక్ష ద్వారా వివిధ శాఖలకు సంబంధించిన అంశాలు నేరుగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో ఉన్న ప్రాజెక్టులో జిల్లా కలెక్టర్ నేరుగా సమీక్ష నిర్వహించి పురోగతి సాధించాలన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21వ తేది నుండి ప్రారంభించి నెల మొత్తం జూన్ 21వ తేది వరకు యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ అనే నినాదంతో వివిధ కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి గారు విశాఖపట్నంలో పాల్గొని ప్రారంభించడం జరుగుతుందన్నారు. యోగ మన జీవితంలో భాగస్వామ్యం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అందుకు ఈ కార్యక్రమాల్లో ప్రజలను, విద్యార్థులను, యువతను పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ పర్సెప్షన్ (ప్రజా అభిప్రాయం)కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సదుపాయాలు, పౌర సేవలపై వారు సంతృప్తిగా ఉన్నారా లేదా అని ఎప్పటికపుడు కలెక్టర్లు సమీక్ష నిర్వహించుకోవాలన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల అభిప్రాయాన్ని సంతృప్తికరంగా ఉండే విధంగా క్రింద స్థాయి అధికారులతో చర్చించి ప్రభుత్వం పట్ల ప్రజల మన్ననను చూరగొనేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# మెస్ బిల్లుల అకౌంట్లు తారుమారు

**ఆ పర్సనల్ అకౌంట్ ఖాతా ఎవరిది**

**తన అనుచర వర్గాన్ని నియమించిన ప్రిన్సిపాల్**

**రోజులు గడుస్తున్నా నివేదిక శూన్యం**

**విద్యార్థులకు భోజన సదుపాయం నిలిపివేత**

**కళాశాల వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన**

**రిపబ్లిక్ న్యూస్ అనంతపురం మే 19 :**
వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసిస్తుంటారు.కళాశాలలోని వసతి గృహాల నిర్వాహకుల సిబ్బంది తదితరులు విద్యార్థుల మెస్ బిల్లులు అధిక మొత్తంలో స్వాహా చేశారు. ఇంతవరకు పోలీసులకు కంప్లైంట్ చేయలేదు. ఈ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి మాట్లాడుతూ.. కరువు జిల్లాకు ఎంతో చరిత్ర కలిగి ఉంది. ఎంతో మంది విద్యార్థి దశ నుండి విద్యార్థి నాయకులుగా ఎదిగారు. ఎంతోమంది ఉద్యమ కారుల ఉద్యమాల ఫలితంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల అనంత జిల్లాకు వచ్చింది. ఎంతో పేరు ప్రఖ్యాతలుగాంచిన ఈ కళాశాలలో విద్యార్థుల మెస్ బిల్లులు స్వాహా చేయడం దారుణమని మండిపడ్డారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. భోజనం కోసం ఏర్పాటు చేసుకున్న నగదు ప్రతినెల ఒక్కొక్క విద్యార్థి దాదాపుగా నాలుగు వేల రూపాయల నుంచి ఆరు వేల రూపాయల వరకు నగదు చెల్లించిన అనంతరం మెస్ ఏర్పాటు చేసుకుంటున్నారు, విద్యార్థులు నగదు చెల్లించడానికి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ప్రత్యేకంగా ఒక అకౌంటెంట్ ని ఏర్పాటు చేసి అందులోనే లావాదేవాలు జరుపుతున్నారు. లావాదేవీలు జరుగుతున్న అకౌంట్లలోని నగదు మొత్తాన్ని అంతా తానై చూసుకుంటున్నారు, విద్యార్థులకు కొంతకాలంగా సరిగా భోజనం,స్నాక్స్ అందకపోవడంతో విద్యార్థులు ప్రశ్నించారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో విద్యార్థులు




అకౌంటెంట్ కి నగదు చెల్లించినా కూడా ఈ విషయం ఏ ఒక్కరికి తెలియకుండా అకౌంటెంట్ తమ పర్సనల్ అకౌంట్ లోకి నగదు లావాదేవీలు జరుపుకున్నారు. కాంట్రాక్టర్లకు నగదును చెల్లించకపోవడంతో వారు నిత్యవసర సరుకులు నిలుపుదల చేశారు, అకౌంటెంట్ విద్యార్థుల నుండి నగదు బదలీ లావాదేవీలు జరిపిన ఆ పర్సనల్ అకౌంట్ ఖాతా ఎవరిదని ఈ విషయాన్ని నిగ్గు తేల్చాలన్నారు. కళాశాలలో ఇంత జరుగుతున్నా ఎందుకు పోలీసులకు కంప్లైంట్ చేయలేదని మండిపడ్డారు, గతంలో ఇదే కళాశాలలో విద్యార్థినికి సంబంధించిన లాప్ టాప్, మొబైల్ పోయినా కంప్లైంట్ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు.కళాశాలలో ఒక సమస్యపై విచారణకు ఆదేశిస్తే ఇతర కళాశాల సిబ్బందిని లేదా రాష్ట్రస్థాయి సిబ్బందిని విచారణలో భాగంగా నియమిస్తారు. అయితే మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ గుట్టు చప్పుడు కాకుండా తమ సిబ్బందిని ఎంక్వయిరీ కమిటీలో వేసారు.వాస్తవాలు బయటకు వస్తే తమకు ముప్పు వాటిల్లుతుందని తెలిసి తన సహచర వర్గాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.
మొదటి కమిటీ వదిలేసి,రెండవసారి కమిటీ వేయడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థినిలు ఏదైనా బయటకు చెబితే మీ మార్కులు మా దగ్గర ఉంటాయి మెస్ బిల్లులలో స్వాహా జరగలేదని తెలపాలని లేకుంటే భవిష్యత్తు లేకుండా చేస్తానని అకౌంటెంట్ విద్యార్థినిలను భయపెట్టడం సరైంది కాదని మండిపడ్డారు. రోజులు గడుస్తున్నా విచారణ కమిటీ ఎందుకు నివేదిక అందచేయలేదని ప్రశ్నించారు,, తక్షణమే కళాశాల ప్రిన్సిపాల్ ఈ సంఘటన పై పోలీస్ కంప్లైంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా కలెక్టర్, రాష్ట్రస్థాయి వైద్య అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
విద్య, వైద్యం కొనలేని విద్యార్థులు పట్ల ఇలాంటి సంఘటనలు జరగడం వల్ల కళాశాలలో విద్యార్థులు చేరడానికి వీలు లేకుండా పోతుందన్నారు.మెస్ బిల్లులు తమ పర్సనల్ అకౌంట్ లోకి లావాదేవీలు జరిపి స్వాహా చేసిన వారి పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అధికారులు దృష్టికి తీసుకొని వెళ్లి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిలు వెంకట్ నాయక్ చందు నగర అధ్యక్షులు మంజునాథ్ నగర కోశాధికారి నాని నగర సహాయ కార్యదర్శి సమీర్ నాయకులు పవన్ బాబ్జాన్ ప్రవీణ్ కార్తీక్ తౌసిఫ్ ఉమేష్ సుభాష్ సుభాహన్ యశ్వంత్ సోమేశ్ యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# తట్టు-రూబెల్లా నివారణకు టీకా ఒక్కటే మార్గం

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల ప్రతినిధి, మే 19 , రిపబ్లిక్ న్యూస్ :-**
తట్టు-రూబెల్ల వ్యాధి నివారణకు టీకా తీసుకోవడం ఒక్కటే మార్గమని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక అనంతరం నేషనల్ జీరో మీజిల్స్-రుబెల్లా ఎలిమినేషన్ క్యాంపెయిన్ కార్యక్రమం (2025-26)లో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ తట్టు-రూబెల్లా నివారణకు టీకా ఒక్కటే మార్గమన్నారు. 9 నెలల నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు **MR-1, MR-2** వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తట్టు-రూబెల్లా వ్యాధిని రూపుమాపేందుకు గాను నేషనల్ జీరో మీజిల్స్-రుబెల్లా ఎలిమినేషన్ క్యాంపెయిన్ ను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. అందుకు గాను 0-5 సం.ల పిల్లలకు తప్పనిసరిగా 3 టీకాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 0-5 సం.ల పిల్లలు 2,34,282 మంది ఉన్నారని అందులో (9-59నెలల) వారికి 27,540 మందికి, రెండవ టీకా 26,410 మందికి ఇవ్వడం జరిగిందన్నారు. చాలా మంది రెండు టీకాలు మాత్రమే తీసుకొని ఆపేస్తున్నారని అలా కాకుండా మొత్తం మూడు టీకాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అందుకు మొదటి విడత మే 26 నుండి 31 మే వరకు, రెండవ రౌండు 23వ తేది జూన్ నుండి 28 జూన్ వరకు, మూడవ రౌండు జూలై 21వ తేది నుండి జూలై 26వ తేది వరకూ నిర్వహించడం జరుగుతుందన్నారు. అందుకు జిల్లాలో ఉన్న చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. 2026వ సంవత్సరం లోపు తట్టు, రూబెల్లా వ్యాధిని నిర్మూలించాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఈ మేరకు ఐసిడిఎస్, పంచాయితీ రాజ్, విద్యాశాఖ, రెవెన్యూ శాఖ తదితర లైన్ డిపార్ట్మెంట్లు సహకరించి మూడు విడుతలు గా జరిగే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# మానవతా దృక్పథంతో ప్రజా సమస్యలను పరిష్కరించండి

## పిజిఆర్ఎస్ దరఖాస్తులకు ఖచ్చితమైన పరిష్కారం చూపండి

## పిజిఆర్ఎస్ కు 213 దరఖాస్తులు -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా










**నంద్యాల ప్రతినిధి, మే19 , రిపబ్లిక్ న్యూస్ :-**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను మానవతా దృక్పథంతో ఆలోచించి సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను మానవతా దృక్పథంతో ఆలోచించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలు నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే ఏ విధంగా చేస్తే సమస్య పరిష్కారం అవుతుందో ఆలోచించాలన్నారు. స్వీకరించిన ప్రతి సమస్యకు ఖచ్చితమైన పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారుల వినతులను సక్రమంగా పరిష్కరించని కారణంగా 49 దరఖాస్తులు రీఓపెన్ అయ్యాయని వీటన్నింటివి నాణ్యతతో తక్షణమే పరిష్కరించాలన్నారు. విఐపి దరఖాస్తులకు సంబంధించి పెండింగ్ లో వున్న 62 అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారుల అభిప్రాయ సేకరణకు సంబంధించి ఇప్పటి వరకు 43.15 శాతం సేకరించడం జరిగిందని పెండింగ్లో ఉన్న డేటాను త్వరితగతిన సేకరించేలా చర్యలు తీసుకోవాలని డిఎల్డిఓలను కలెక్టర్ ఆదేశించారు.

గ్రామ, వార్డు సచివాలయ సర్వేలలో భాగంగా మన మిత్ర క్యాంపెయిన్ కు సంబంధించి ఇంకా 13,724 పెండింగ్ ఉందని, వర్క్ ఫ్రమ్ హోంకు సంబంధించి 2367 పెండింగ్లో ఉన్నాయని సంబంధిత సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే మిస్సింగ్ సిటిజన్స్ కు సంబంధించి 712, సిటిజెన్ ఈకేవైసి 2,34,772 మందికి పెండింగ్ లో ఉన్నాయన్నారు. చిల్డ్రన్ వితౌట్ ఆధార్ 7800, హౌసింగ్ ఇమేజ్ జియో కోఆర్డినేట్ కు సంబంధించి 626 పెండింగులో ఉన్నాయని వాటిని తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని సమస్యలు.**

1) దొర్నిపాడు మండలం చాకిరాజువేముల గ్రామ కాపురాస్తురాలు రమాదేవి తన భర్త మరణించి సంవత్సరం అవుతుందని... తనకు ఇద్దరు పిల్లలున్నారని ఎలాంటి జీవనాధారం లేని నాకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు ను సమర్పించుకున్నారు.

2) బేతంచెర్ల మండల కేంద్రంలోని కాపురస్తూరాలు పద్మావతమ్మ తనకు సర్వే నంబర్ 527/1%దీ% లో 0.42 సెంట్లు బేతంచెర్ల బైపాస్ రోడ్డు కు తీసుకున్నారని... సంబంధిత పొలంలో బావి మరియు ఒక రూం ఉందనీ పొలానికి మాత్రమే డబ్బులు మంజూరు చేశారు కానీ బావికి రూంకి డబ్బులు మంజూరు చేయలేదని... నా సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు.

3) కోవెలకుంట్ల మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ రెహమాన్ తనకు సర్వే నంబర్ 55/%ూ౩ూ% లో 1.36 సెంట్ల పట్టా భూమి ఉన్నదనీ... సంబంధిత భూమి నిషేధిత జాబితాలో ఉన్నట్లు ఆన్లైన్లో, రెవెన్యూ రికార్డులలో పట్టా భూమిగా ఉందనీ... ఆన్లైన్లో నిషేధిత భూమి నుంచి తొలగించవలసినదిగా కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో 213 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# హజ్ యాత్రికులకు ప్రభుత్వ ఏర్పాట్లు

**రెండవ విడత లో 906 మంది హజ్ కు**

**హైదరాబాద్ నుంచి మూడు విమానాల్లో జెడ్డా కు పయనం**

**జెండా ఊపి ప్రారంభించిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**1630 మంది ఏపీ ప్రయాణికులకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి**



**అమరావతి మే 19 (రిపబ్లిక్ న్యూస్) :**
ఆంధ్రప్రదేశ్ నుండి హజ్ యాత్ర -2025 కు బయలుదేరే యాత్రికులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అత్యంత పగడ్బందీగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. హైదరాబాద్ ఎంబార్కేషన్ సెంటర్ నుంచి రెండవ విడతలో 906 మంది ఏపీ ప్రయాణికులు సోమ, మంగళవారాల్లో మూడు విమానాలలో హజ్ యాత్రకు జెడ్డాకు వెళ్తున్నారు. హైదరాబాదులోని లకడికపూల్ సెంటర్లో ఉన్న షా ఫంక్షన్ ప్లాజాలో ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమాన్ని మైనారిటీ మంత్రిత్వ శాఖ, హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రెండవ విడత యాత్రకు బయలుదేరి వెళ్లే యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, మైనారిటీ మంత్రిత్వ శాఖ సలహాదారుడు ఎంఎ షరీఫ్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష,హజ్ కమిటీ సభ్యులు, తదితరులు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రస్తుత ఏడాది పవిత్ర హజ్ యాత్రకు మొత్తం 1630 మంది యాత్రికులు వెళ్లడం జరుగుతున్నదని అన్నారు. ఇందులో 1170 మంది హైదరాబాద్ ఎంబార్కెషన్ కేంద్రం నుంచి, 451 మంది బెంగళూరు ఎంబార్కెషన్ కేంద్రం నుంచి, మిగిలిన 9 మంది ఇతర ఎంబార్కెషన్ కేంద్రాల నుంచి బయలుదేరడం జరుగుతున్నదని వెల్లడించారు. ఈనెల 19,20 వ తేదీలు సోమ,మంగళ వారాలలో మూడు విమానాల్లో మొత్తం 818 మంది హజ్ యాత్రికులు హైదరాబాద్ ఎంబార్కెషన్ కేంద్రం నుండి హజ్ కు వెళ్తున్నట్లు తెలిపారు. మరో 88 మంది యాత్రికులు ఈనెల 27 వ తేదీ చివరి విమానంలో హజ్ యాత్రకు వెళ్తున్నట్లు తెలిపారు. విజయవాడ ఎంబార్కెషన్ నుంచి కేవలం 72 మంది యాత్రికులు మాత్రమే తమ ఆప్షన్ ఇవ్వడం కారణంగా, సాంకేతిక కారణాల వలన, భారత విమానయాన శాఖ ద్వారా స్పెషల్ చార్టర్ ఫ్లైట్ వసతి కల్పించలేని పరిస్థితితులలో, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా, ముంబై ఆ 72 మంది యాత్రికులను హైదరాబాద్ ఎంబార్కెషన్ నుండి బయలుదేరుటకు అనుమతించడం జరిగిందని పేర్కొన్నారు. గత నెలలో మొదటి విడతలో హజ్ యాత్రకు ఏపీ నుంచి 724 మంది యాత్రికులు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కెషన్ కేంద్రాల నుండి పవిత్ర మక్కా, మదీనా పుణ్య క్షేత్రాలకు వెళ్లడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సురక్షితంగా, క్షేమంగా వారంతా చేరడం జరిగిందని మిగిలిన యాత్రికులకు కూడా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఏపీ హజ్ యాత్రికులకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఏలాంటి లోటు పాట్లు లేకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందని మంత్రి ఫరూక్ వెల్లడించారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, వ్యాక్సినేషన్ క్యాంపులు నిర్వహించడమైనదని, కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు, ఆయా రాష్ట్రాల హజ్ కమిటీల తో, ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశాలు కూడా నిర్వహించి ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించామని తెలిపారు. పూర్తి సహకారాన్ని అందిస్తున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలకు మంత్రి ఫరూక్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసర, ఆవశ్యకతలను బట్టి ఏర్పాట్ల ప్రక్రియ పూర్తి చేసి పర్యవేక్షిస్తున్నట్టు వెల్లడించారు. మన రాష్ట్రం నుండే నేరుగా హజ్ కి వెళ్ళేందుకు ఏర్పాట్లు ఉంటే మరింత సౌలభ్యంగా ఉంటుందని ఒక యాత్రికురాలు కోరగా, విజయవాడ ఎంబార్కేషన్ కోరే ప్రతి హజ్ యాత్రికుడికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామని మంత్రి తెలిపారు. మైనారిటీ మంత్రిత్వ శాఖ ప్రభుత్వ సలహాదారుడు ఎంఎ షరీఫ్ మాట్లాడుతూ హజ్ యాత్రికులను సాగనంపే ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. హజ్ యాత్ర ఆధ్యాత్మిక ప్రయాణం మాత్రమే కాదని,సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వాన్ని పెంపొందించే ముఖ్య సందేశమని పేర్కొన్నారు. హజ్ యాత్ర విజయవంతంగా సాగేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారులు, సిబ్బంది సహకారం అందిస్తారని, అందరూ అవసరమైన సహాయాన్ని పొంది యాత్రను దిగ్విజయంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ ఈవో గౌస్ పీర్, రెండు తెలుగు రాష్ట్రాల మైనార్టీ మంత్రిత్వ శాఖలు, హజ్ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిబంధనల ననుసరించి సాధారణ బదిలీలు చేపట్టండి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల ప్రతినిధి, మే 19, రిపబ్లిక్ న్యూస్ :-**
ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల నిబంధనలను అనుసరించి మాత్రమే జిల్లా అధికారులు తమ పరిధిలోని ఉద్యోగులను బదిలీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక అనంతరం సాధారణ బదిలీలు, స్వచ్ఛఆంధ్ర - స్వర్ణఆంధ్ర తదితర కార్యక్రమాపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి,సాధారణ బదిలీలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, ఆ ఉత్తర్వులలోని నిబంధనలను ఏమాత్రం అతిక్రమించకుండ బదిలీల ప్రక్రియ చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛఆంధ్ర - స్వర్ణఆంధ్ర కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. జూన్ మాసంలో నీరు-మీరు అనే థీమ్ తో పల్లె పుష్కరిణి అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న ట్యాంకులను అభివృద్ధి చేయడానికి డ్వామా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నీటి తోట్ల చుట్టూ బండ్ పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా జనవరి నుండి ఇప్పటి వరకు నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర - స్వర్ణఆంధ్ర కార్యక్రమాల ఫోటోలను అన్ని కార్యాలయాల్లో వాల్ రూపంలో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# భారీ వర్షాలు నేపథ్యంలో ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలి

## మండల, జిల్లా కార్యాలయాల్లో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయండి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల ప్రతినిధి, మే 19, రిపబ్లిక్ న్యూస్ :-**
రానున్న 3 రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం వున్న నేపథ్యంలో ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమ అనంతరం అధిక వర్షాల పట్ల అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలను జారీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ రానున్న మూడు రోజుల్లో జిల్లాలో ఈదర గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఓ, తహశీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా మండల, జిల్లా స్థాయిలో 24/7 సిబ్బందితో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు అందులో ఉన్న సిబ్బంది పేరు, ఫోన్ నెంబరుతో సహా కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలన్నారు. జిల్లాలో సుమారుగా 25 వేల వరకు మట్టి మిద్దెలు ఉన్నాయని అధిక వర్షాల వల్ల ఇళ్లలో ఉండడం సబబు కాదన్న విషయాన్ని విఆర్ఓల ద్వారా వారికి తెలుపుతూ అందుకు తగ్గ నోటీసులు జారీ చేసి సదురు కాపీని ఇంటికి కూడా అతికించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 21 వాగులు, కాలువలు ఉన్నాయని అందులో గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకపోకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వాగుల ద్వారా వచ్చే నీరు కుందూ నదిలో కలుస్తున్నందున పరీవాహక ప్రాంతాల పరిసరాలను అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. అదే విధంగా ఈదురు గాలుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు పడే అవకాశం ఉంటుందని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పిడుగు పాటు వల్ల ఏ ఒక్కరూ మృతి చెందకూడదనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఏ మండలంలో, ఏ గ్రామంలో పిడుగు పాటు పడే అవకాశం ఉందన్న ఖచ్చితమైన సమాచారం ముందస్తుగా ఇవ్వడం జరుగుతుందని సదరు సమాచారాన్ని గ్రామ స్థాయి వరకు అందజేసి ఏ ఒక్కరూ ప్రమాదాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పాడి పశువులను కూడా జాగ్రత్తగా చూసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

# మెప్మా ఆధ్వర్యంలోని ఉత్పత్తులను కొనుగోలు చేయండి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల ప్రతినిధి, మే 19 , రిపబ్లిక్ న్యూస్ :-**
మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలచే తయారు చేసి విక్రయిస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేయాలనిజిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైస్టోర్ యాప్ లో విక్రయిస్తున్న ఉత్పత్తులను ఆన్లైన్ లో ఓపెన్ చేసి జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలచే తయారు చేసే ఉత్పత్తులను మైస్టోర్ యాప్ ఆన్లైన్ మాధ్యమంలో విక్రయించడం జరుగుతుందని తద్వారా వారికి చేయూత ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ యాప్ లో ఇప్పటి వరకు 1200 వరకు ఉత్పత్తులను నాణ్యమైన పద్ధతిలో తయారు చేసి విక్రయించడం జరుగుతుందన్నారు. మైస్టోర్ లో బుక్ చేసే ఉత్పత్తులను థర్డ్ పార్టీ ప్రతినిధుల ద్వారా వినియోగదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం మైస్టోర్ యాప్ లో విక్రయిస్తున్న ఉత్పత్తులను ఆన్లైన్ లో ఓపెన్ చేసి జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు.

ప్రజా దిన పత్రిక రిపబ్లిక్ ప్రతి అక్షరం ప్రజల కోసం
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన
సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న
ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో
స్టాప్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను.
ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం
చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు
కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల
నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com